
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శుక్రవారం 2 ఫిబ్రవరి 2024 | 5





పులి జాడేది!

పులి పాదముద్ర

ఒకటి కాదు రెండా?

పులి కంగారెత్తిస్తోంది.. ఎక్కడ ఉందో ఎలా ఉందో తెలియదు కానీ.. పులి పాదముద్రలను పోలిన పాదముద్రలు కనిపిస్తే చాలు జనం హడలెత్తిపోతున్నారు.. ఎందుకంటే సుమారు 10 రోజులుగా అటు ఏలూరు జిల్లాలోని బుట్టాయగూడెం నుంచి ఇటు తూర్పుగోదావరి జిల్లాలోని నల్లజర్ల అటవీ కేంద్రాల్లో తిరుగుతున్నట్టు వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి.. తాజాగా పులి గోపాలపురం, దేవరపల్లి అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్టు చెబుతున్నారు.. ఈ టెన్షన్ తీరలేదంటే గురువారం తాళ్ళపూడిలో చిరుత సంచరిస్తున్నట్టు ఒక వీడియో బయటకు వచ్చింది.. దీంతో జనం వణికిపోతున్నారు. -7లో

చనిపోయినా ఓటు

- రాజానగరంలో వింత పరిస్థితి
- చక్రద్వారబంధంలో 33 ఓట్లు
- ఓటర్ల తుది జాబితాలో ఇదీ తీరు

రాజానగరం, ఫిబ్రవరి 1 : ఓటర్ల జాబితాలకు తుది మెరుగులు ఎన్ని అద్దినప్పటికీ ఇంకా అనేక లోపాలు వెలుగు చూస్తు న్నాయి. జాబితాల్లో అర్హుల ఓట్లు కనుమరుగై.. అనర్హుల పేర్లు దర్శనమిస్తున్నాయి. అలాగే శాశ్వతంగా గ్రామాంతరం వెళ్లిన వారి పేర్లు, ఒక్కొక్కరికి రెండేసి ఓట్లు (డబుల్ ఎంట్రీ)పేర్లు సైతం కనిపిస్తున్నాయి.ఈ నేపథ్యంలో జాబితాల రూపకల్పనలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు న్నాయి.రాజాన గరం మండలం చక్రద్వారబంధం గ్రామ ఓటర్ల జాబితానే ఇందుకు నిలువెత్తు నిదర్శనం. ఇటీవల జనవరి 22న ప్రభుత్వం విడుదల చేసిన ఓటర్ల తుది జాబితా ప్రకారం గ్రామంలో 170,171,172 పోలింగ్ కేంద్రాల్లో 3,463 మంది ఓటర్లు ఉన్న ట్టుగా ఆయా గ్రామ సచివాల యాలకు జాబి తాలు విడుదల య్యాయి. అయితే వీటిలో 170వ పోలింగ్ కేంద్రంలో జాబితాల్లో ఏకంగా 33 మంది మృతులకు ఓటు హక్కు కల్పించిన పేర్లు దర్శనమిచ్చాయి. గ్రామానికి చెందిన పిల్లా నాగేశ్వరరావు, పితాని రామ స్వామి, భూషంశెట్టి సీతారత్నం, సుంకర చక్రం, చిక్కాల సూర్యారావు, వనుం సూరమ్మ, ఏగి సూర్యారావు తది తరులు గత కొన్నేళ్ల కిందట మర ణించారు. మృతుల పేర్లు సైతం జాబితాల్లో పొందుపర్చి మృతులకు ఓటు హక్కు కల్పించడంపై గ్రామస్తులు ఆశ్చర్యానికి లోనయ్యారు. దీంతో జాబితాల్లో లోపాలను ఆలస్యంగా గుర్తించిన బూత్ ఇన్‌చార్జ్ మాదబోయిన శ్రీను, యూనిట్ ఇన్‌చార్జ్ షోడసాని త్రిమూ ర్తులు ఓటర్ల జాబితాల్లో చేసుకున్న లోపాలను సవరించాలని కోరుతూ స్థానిక బీఎల్‌వోకు వినతి పత్రాలు అందజేశారు. రాష్ట్ర ఎన్నికల అధికారులు సవరణ షెడ్యూల్ ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికి తమకేమీ పట్టనట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు.రాజానగరం నియోజకవ ర్గంలో 216 పోలింగ్ కేంద్రాల్లో 2,13,911 మంది ఓటర్లు ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 1,05,824 మంది, మహిళలు 1,08,083 మంది, థర్డ్ జెండర్ 4 ఉన్నట్లుగా ప్రచురించి తుది జాబితాను విడుదల చేశారు. అయితే ఒక్క చక్రద్వార బంధం లోనే ఇన్ని లోపాలు వెలుగు చూస్తే నియోజకవర్గం మొత్తంగా ఎన్ని లోపాలు,అవకతవ కలు చోటు చేసుకుంటాయోనని తెలు గు తమ్ముళ్లు ఆందోళన చెందుతు న్నారు. జాబితాల్లో చోటు చేసుకున్న లోపాలను సవరించాలని కోరుతూ గ్రామంలోని బీఎల్‌వో మల్లికకు యూనిట్ ఇన్‌చార్జ్ త్రిమూర్తులు వినతి పత్రం అందజేశారు.



మధ్యంతర గేలం!



పార్లమెంట్ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ కేంద్ర ప్రభుత్వ మధ్యంతర బడ్జెట్ మధ్యతరగతి, పేదలపై దృష్టి పెట్టింది. సామాన్యుల ఓట్లను ఆకర్షించడమే లక్ష్యంగా అడుగులు వేసింది. సొంతింటి కలను నెరవేర్చుకోవాలనే బడుగు జీవుల ఆశలపై ఓట్ల వల విసిరింది. రైతులు, మహిళలకు పెద్దగా ఖర్చులేని వరాలు ప్రకటించి ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. విద్యుత్ బిల్లుల భారంతో చితికిపోతున్న పేదలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేలా రూఫ్‌టాప్ సోలారైజేషన్ స్కీం ప్రకటించి వారికి దగ్గరయ్యే ప్రయత్నం చేసింది. పన్నుల విధానంలో ఏమార్పు చేపట్టకుండా వేతనజీవిని ఉసూరుమనిపించింది. కొత్త విధానంలో రూ.7 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉండగా, దాన్ని రూ.8 లక్షలకు పెంచుతారని ప్రచారం జరిగినా కరుణించలేదు. అటు పీఎం కిసాన్ సాయాన్ని రూ.8 వేలకు పెంచుతారని లీకులిచ్చినా బడ్జెట్‌లో ఆ ఊసే లేదు. వెరసి పలురకాల ఆకర్షణలతో ఓట్లను రాబట్టుకోవడమే లక్ష్యంగా నిర్మలమ్మ పద్దు మమ అనిపించింది.

వేతనజీవికి రిక్తహస్తం..

ఏటా కేంద్ర బడ్జెట్‌లో వేతన జీవులకు ఎంతోకొంత ఊరట ఉంటుందని భావించడం, చివరకు భంగపాటుకు గురవడం షరా మామూలుగా మారింది. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓట్ల ఆకర్షణే ధ్యేయంగా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు ఎంతోకొంత ఆదాయపు పన్ను తగ్గింపును కేంద్రం ప్రకటిస్తుందని అంతా భావించారు. ఈ మేరకు లీకులు కూడా వెలువడ్డాయి. కానీ ఎప్పటిలాగే నిర్మలమ్మ బడ్జెట్ వేతన జీవులకు ఊరట కల్పించలేదు. ఒకరకంగా చెప్పాలంటే ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన ఈ తాత్కాలిక బడ్జెట్‌లో పన్ను విధానాల్లో ఎలాంటి మార్పుల జోలికి వెళ్లలేదు. కొత్త విధానంలో ఉన్న పన్నుదారులకు రూ.7 లక్షల వరకు ఎలాంటి పన్ను ఉండదని మాత్రం చెప్పారు. వాస్తవానికి దీన్ని ఈ మధ్యంతర బడ్జెట్‌లో రూ.8 లక్షలకు పెంచుతారని భావించినా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. దీంతో వీరందరికీ నిరాశే మిగిలింది. వాస్తవానికి జిల్లాలో సచివాలయ ఉద్యోగులతో కలిపి మొత్తం 23 వేల మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో వార్షిక ఆదాయం రూ.7 లక్షలు, ఆపై కొంచెం దాటిన వారు సగం మంది వరకు ఉన్నారు. కేంద్రం గనుక ఈ పరిమితిని రూ.8 లక్షల వరకు పెంచి ఉంటే వీరందరికి భారీ ఊరట లభించేది. కానీ నిర్మలమ్మ పద్దు వీరందరినీ ఉసూరుమని పించింది. స్లాబ్‌ల విధానాన్ని మాత్రం కుదించారు.

కాకినాడ (ఆంధ్రజ్యోతి)/ రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఓట్ల ఆకర్షణే లక్ష్యంగా సాగిన తాత్కాలిక బడ్జెట్‌లో మధ్యతరగతికి కేంద్రం తీపికబురు అందించింది. వీరికి ఇళ్ల కొనుగోలు, సొం తింటి నిర్మాణం కోసం కొత్త హౌసింగ్ స్కీం ప్రకటించింది. బస్తీలతో పాటు అద్దె ఇళ్లల్లో ఉన్న వారికి సొంతింటి కల నిజం చేస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో సొంతింటి కల తీరబోతుందనే ఆశ పేద, మధ్యతరగతి వర్గాల్లో పెరిగింది. అయితే ఈ పథకం కింద బ్యాంకు లోన్లకు సంబంధించి రాయి తీలను కేంద్రం అందించ నుంది. ఈ పథకానికి సంబంధించి మార్గదర్శకాలు విడుదలైతే ఎవరు అర్హులవు తారనేదానిపై మరింత స్పష్టత రానుంది. అయితే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రాలైన కాకినాడ,అమలాపురం, రాజమహేంద్రవరంతో పాటు పలు మునిసి పాలిటీల పరిధిలోని పట్టణాల్లో వేలాది మంది సొంతిళ్లు లేక అద్దె ఇళ్లల్లో నివసిస్తున్నారు. కేంద్రం ప్రకటించిన ఈ పథకంతో వారికి మరింత లబ్ధి కలగనుంది. మరో పక్క రాబోయే ఐదేళ్లలో పీఎం ఆవాస్ యోజన కింద రెండు కోట్ల ఇళ్ల కట్టిస్తామని కేంద్రం ప్రకటించింది. దీంతో జిల్లా లో భారీగా లబ్ధిదారులు పెరగను న్నారు. విద్యుత్ బిల్లుల నుంచి సామాన్యులకు విముక్తి కలిగించేలా బడ్జెట్‌లో కేంద్రం నూతన పథకం ప్రకటించింది. నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేలా రూఫ్ టాప్ సోలారైజేషన్ పథకాన్ని ప్రవేశ పెట్టనుంది. దీని వల్ల గృహ వినియోగదారులకు ఏటా రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు ఆదా అవుతుందని ప్రకటించిం ది. కొత్త పథకం కింద వేలాది మంది లబ్ధిపొందనున్నారు. పాడి రైతులకు సంబంధించి పశువుల్లో పాల దిగుబడి పెం చడానికి కొత్త పథకాన్ని కేంద్రం ప్రకటించింది. పాల దిగుబడి మరింత పెరిగే అవకాశం ఉంది. మరోపక్క ఆక్వా దిగుబడిని హెక్టారుకు మూడు టన్నుల నుంచి ఐదు టన్నులకు పెంచేవిధంగా చర్యలు చేపడ తామని కేంద్రం ప్రకటించింది. అంగన్‌వాడీ కేంద్రా లను ఆధునికీకరిస్తామని బడ్జెట్‌లో ప్రక టించడం కొత్త ఆశలు రేపుతోంది. జిల్లాలో 1547 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. చాలా భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో తాజా బడ్జెట్ ద్వారా వీటికి మంచిరోజులు రానున్నాయి. అన్నదాతలు ఏటా పీఎం కిసాన్ కింద ఆర్థిక సాయం పొందుతున్నారు. వీరికి ఇస్తోన్న రూ.6 వేల సాయాన్ని పెంచుతారని ప్రచారం జరిగినా మొండిచేయే మిగిలింది.

పర్యాటకంపై ఆశలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంటేనే పర్యాటక రంగానికి ప్రసిద్ధి. అటు ఆధ్యాత్మిక టూరిజం, ఇటు రివర్, ఎకో టూరిజం, ఇంకోవైపు బీచ్ టూరి జంపరంగా అద్భుతమైన పర్యాటక కేంద్రాలు ఉన్నాయి. అయితే అభివృద్ధి మాత్రం అంతగా లేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వీటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. కేంద్రం కొత్త బడ్జెట్‌లో పర్యాటక రంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపింది. పర్యాటక రంగ అభివృద్ధి, అక్కడ అందే సేవల ఆధారంగా ఈ పర్యాటక కేంద్రాలకు రేటింగ్ ఇవ్వాలని నిర్ణయించింది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వాలతో కలసి దామాషా పద్ధతిన ఆ కేంద్రాల అభివృద్ధికి వడ్డీ రహిత రుణాలందించాలని భావిస్తున్నట్టు బడ్జెట్‌లో ఉదహరించారు.ఇదే అమల్లోకి తెస్తే కోట్లాది రూపాయలు ఆయా పర్యాటక ప్రాజె క్టుల కోసం ఖర్చు చేసే అవకాశం ఉంది. కచ్చితంగా ఏపీకి వచ్చేసరికి ఉమ్మడి తూర్పు గోదావరికి ప్రయోజనం చేకూరుతుందని జిల్లావాసులు భావిస్తున్నారు.

‘పోలవరం’ మాటేమిటి?

కేంద్ర బడ్జెట్‌లో ఈసారి కూడా పోలవ రానికి ప్రత్యేక నిధులు కేటాయిం చిన దాఖలాలు ఇప్పటివరకు లేవు. ఆర్అండ్ ఆర్ పూర్తి స్థాయిలో అమలుచేయడం గాని, ప్రాజెక్టును పూర్తి చేయడానికి గాని కేంద్రం ఇచ్చే నిధులే ప్రధాన ఆధారం. ఇది మధ్యంతర బడ్జెట్ అయినప్పటికీ ఈ ప్రాజెక్టుకు ఎన్నికల నేపథ్యంలోనైనా న్యాయం జరుగుతుందని రైతులు ఆశిం చారు. ఆ దిశగా నిధుల కేటాయింపు జరిగినట్టు లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

- మధ్యతరగతి జీవులపై కేంద్ర బడ్జెట్ ఆశల వల
- అద్దె ఇళ్లల్లో నివసిస్తున్న వారి సొంతింటికో పథకం
- విద్యుత్ బిల్లుల విముక్తికి రూఫ్‌టాప్ సోలారైజేషన్ స్కీం
- వేతనజీవికి పూర్తిగా నిరాశే
- తాత్కాలిక పద్దులో కానరాని ఆదాయపు పన్ను మార్పులు
- పీఎం కిసాన్ సాయం పెంపు మాటేలేదు
- పర్యాటక రంగం అభివృద్ధి వడ్డీ రహిత రుణాలు
- అంగన్‌వాడీ కేంద్రాల ఆధునికీకరణ
- పోలవరం మాటేమరిచారు?

ఇది పూర్తిగా ఎన్నికల బడ్జెట్



బడ్జెట్ పూర్తిగా ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రజల దృష్టిని మరల్చేలా ఉంది. ఎరువుల ధరలు తగ్గిస్తామని రైతులకు మాట ఇచ్చి బడ్జెట్‌లో అంశాన్ని చేర్చలేదు. పీఎం కిసాన్ సాయాన్ని రూ. 9వేలకు పెంచుతారని అంచనా వేసినా ఆ దిశగా ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం .

- గన్నికృష్ణ ,టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఆంధ్రాకు గుండుసున్నా



బడ్జెట్‌లో ఆంధ్రాకు ఒరిగిందేమిలేదు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కేవలం బడ్జెట్ పేరుతో చేసిన ఎన్నికల ప్రసంగమే. ఇలాంటి చెత్త బడ్జెట్ ఏనాడూ చూడలేదు. వచ్చే ఐదేళ్ళ భారత్ అద్భుతమైన ప్రగతి సాధించ బోతుందని చెప్పుకోవడం ఎన్నికల ర్యాలీల్లో చేసిన ప్రసంగంలా ఉంది.

- మధు, సీపీఐ జిల్లా కార్యదర్శి

బిరియానీ ధర కోసం ఘర్షణ..
ఒకరిపై ముగ్గురు దాడి

గోకవరం, ఫిబ్రవరి 1 : బిరియానీ ధర విషయమై జరిగిన ఘర్షణ ఒకరిపై హత్యాయత్నానికి దారితీసింది. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ లో గురువారం నార్త్‌జోన్ ఇన్‌చార్జ్ డీఎస్పీ కిషోర్‌కుమార్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడిం చారు. పోలీస్ స్టేషన్ ప్రక్కన గల లక్ష్మీ కళ్యాణ ఫ్యామిలీ రెస్టారెంట్ వద్దకు గోకవరం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు బిరియానీ కోసం వెళ్లడం జరిగిందన్నారు. ఆ సమయంలో బిరియానీ ధర విషయంలో రెస్టారెంట్‌లో పనిచేస్తున్న ములపర్తి రాజుకు ఆ ముగ్గురు వ్యక్తుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుందని తెలిపారు.ఆ ముగ్గురు వ్యక్తులు పక్కనే ఉన్న డ్రింక్ బాటిల్‌ని పగలగొట్టి రాజు వీపు పైన రెండుసార్లు, ఎడమ చేతిపై ఒకసారి కొట్టడం జరిగిందన్నారు.దీంతో రాజు గాయపడగా ప్రభుత్వాసుపత్రిలో చికి త్స పొందుతున్నాడని చెప్పారు.రెస్టారెంట్‌లో బుధవారం దాడి సంఘ టన బ్లేడ్ బ్యాచ్ పని కానే కాదని తెలిపారు.బాధితుడు రాజు పిర్యాదు మేరకు గోకవరానికి చెందిన రొంగలి ఈశ్వర వీర గణేష్, పోసిన వీరబా ర్గవ్,తోట దీపకపై కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బస్, ఎటువంటి పత్రాలు లేని నగదు

రూ.9,91,820ల నగదు సీజ్

సరైన పత్రాలు లేకుండా బస్‌లో తరలిస్తుండగా పట్టివేత

కొవ్వూరు,ఫిబ్రవరి 1 : సరైనపత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.9,91, 820ల నగదు, 17 గ్రాముల బంగారు వస్తువులను కొవ్వూరు పట్టణ పోలీ సులు స్వాదీనం చేసుకున్నారు.కొవ్వూరు గామన్‌బ్రిడ్జి టోల్ గేట్ వద్ద బుధ వారం రాత్రి కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు సిబ్బ ందితో వాహన తనిఖీలు చేపట్టారు.పలాస నుంచి శ్రీకాకుళం వెళుతున్న ప్రతాప్ ట్రావెల్స్ ప్రైవేటు బస్సు డ్రైవర్ బాల దివాకర్‌కు శ్రీకాకుళంలో ఒక వ్యక్తి 17 గ్రాము ల బంగారు చైను, రూ. 6,41,820లు నగదు,మరొక వ్యక్తి రూ. 3,50,000ల నగదును వేర్వేరుగా పార్శిల్ చేసి విజయవాడలో ఇమ్మన్నారు. నగదుకు సంబంధించి పత్రాలు చూపించకపోవడంతో నగదు, బంగారు గొలు సు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని బస్సు సీజ్‌చేసి కొవ్వూరు పోలీస్టేషన్‌కు తరలించారు.డ్రైవర్ బాల దివాకర్ ను తహశీల్దార్ కోర్టులో హాజరుపర్చనున్నట్టు సీఐ జగదీశ్వరరావు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

‘తోట’ తీరు బాగోలేదు

- ఆయన వల్లే నాయకులు వైసీపీని వీడుతున్నారు
- భవిష్యత్తులో జగ్గంపేట నియోజకవర్గంలో వైసీపీ ఖాళీ
- గోకవరం జడ్పీటీసీ దాసరి శ్రీరంగ, వైసీపీ నాయకులు

గోకవరం, ఫిబ్రవరి1: జగ్గంపేట వైసీపీ ఇన్‌చార్జ్, మాజీమంత్రి తోట నరసింహం నాయకులతోను, కార్యకర్తలతోను వ్యవహరిస్తున్న తీరువల్ల నియోజకవర్గంలో పార్టీ తీవ్రంగా నష్టపోతుందని గోకవరం జడ్పీటీసీ దాసరి శ్రీరంగ, ఆమె భర్త వైసీపీ సీనియర్ నాయకుడు దాసరి రమేష్ ఆరోపించారు. గోకవరంలోని వైసీపీ కార్యాలయం వద్ద గురువారం పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.జడ్పీటీసీ శ్రీరంగ, రమేష్ మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా తోట నరసింహం నియామకం జరిగాక పార్టీలోని సీనియర్ నాయకులను, కార్యకర్తలను సంప్రదించ కుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన చెందారు. దీంతో చాలా మంది సీనియర్ నాయకులు పార్టీని వీడుతున్నారన్నారు. భవిష్యత్తులో కూడా ఆయన ఇదే వైఖరిని ప్రదర్శిస్తే నియో జకవర్గంలో వైసీపీ ఖాళీ అయిపోయే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా తాను కూడా వైసీపీని వీడతానన్నారు. సమావేసంలో వైసీపీ నాయకులు దాసరి రమేష్, ఆకుల సుబ్రహ్మణ్యం, అప్పారావు కాపు, ఉయ్యూరు నాని, కంచి లక్ష్మణదొర, దోమల గంగాధర్, జాస్తి వసంత్ తదితరులు పాల్గొన్నారు.

శిరోముండనం కేసులో చారిత్రాత్మక తీర్పు

- క్వాష్ పిటీషన్ కొట్టివేసి విచారణకు ఆదేశాలు?
- సోషల్ మీడియాలో హల్‌చల్

సీతానగరం,ఫిబ్రవరి 1 : సీతానగరంలో నాలుగేళ్ల కిందట జరిగిన దళిత యువకుడి శిరోముండనం కేసులో చారిత్రాత్మక తీర్పు వెలువడి నట్టు సమాచారం. క్వాష్ పిటిషన్ కొట్టివేసినట్టు సోషల్ మీడియాలో కథనాలు నడుస్తున్నాయి.సీతానగరం మండలం మునికూడలి గ్రామానికి చెందిన దళిత యువకుడు వరప్రసాద్ ఇసుక అక్రమ రవాణా అడ్డుకుం టున్నాడన్న నెపంతో వైసీపీ నాయకులు పోలీస్ స్టేషన్‌లో శిరోముండనం చేయించారు.ఈ కేసుపై తదుపరి విచారణ జరగకుండా నిందితులు స్టే ఉత్తర్వులు పొందారు. దీనిపై సుదీర్ఘవిచారణ అనంతరం క్వాష్ పిటిషన్ కొట్టివేస్తూ విచారణ కొనసాగించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసినట్టు సోషల్‌మీడియాలో హల్‌చల్ అవుతోంది.దీనిపై సీతానగరం ఎస్ఐ రామ కృష్ణను వివరణ కోరగా తాను కూడా సోషల్‌మీడియాలోనే చూశానని.. అధికారిక ఉత్తర్వులు ఇంకా అందలేదన్నారు. - వివరాలు 9లో

జిల్లాలో టెన్త్ ,ఇంటర్
పరీక్షలకు ఏర్పాట్లు
వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 1: జిల్లాలో వచ్చే నెలలో జరిగే టెన్త్ ,ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత తెలిపారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి గురువారం నిర్వహించిన వీడి యో కాన్ఫరెన్స్‌లో జిల్లా ప్రగతిని వివరించారు. టెన్త్ , ఇంటర్ పరీక్షలపై వివరాలు వెల్లడించారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలకు సంబంధించి 137 పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. మొత్తం 23,681 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా వారిలో బాలలు 12,112, బాలికలు 11,516 మంది ఉన్నారని తెలిపారు. వీరిలో ఆంగ్ల మాధ్యమంలో 17,267 మంది, తెలుగు మాధ్యమంలో 6,414 మంది హాజరవుతారని తెలిపారు. గత ఏడాది 72 శాతం ఉత్తీర్ణత సాధించారని ఈ ఏడాది నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇంటర్ పరీక్షలకు సంబం ధించి జిల్లాలో 52 పరీక్ష కేంద్రాల ద్వారా 41,304 మంది హాజరుకానున్నారని వారిలో మొదటి ఏడాది 21,288 మంది ద్వితీయ సంవత్సరం 20,016 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఇంటర్మీడియెట్‌కి 37,502 మంది, ఒకేషనల్ కోర్సు విద్యార్థులు 3802 మ ంది ఉన్నారని తెలిపారు. జిల్లాలో రిజిస్ట్రేషన్ కోసం జిల్లాలో 57,918 ప్లాట్స్ మ్యాపింగ్ పూర్తి చేశామని, సుమారు 55 వేల ప్లాట్స్‌కు సరిహద్దులు గుర్తించినట్టు తెలిపారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ, ఉపాధి హామీ, జగనన్న ఆరోగ్య సురక్షల ప్రగతిపై వివరాలు వీడియో కాన్ఫరెన్స్‌లో వివరించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, సీపీవో ఎల్ అప్పలకొండ, డ్వామా పీడీ ఏ.ముఖలింగం, డీఎంహె చ్‌వో డాక్టర్ కే.వెంకటేశ్వరరావు, డాక్టర్ సూర్యప్రభ, డాక్టర్ ఎన్.సనత్ కుమారి, డాక్టర్ పి.ప్రియాంక, డీపీవో జీవీసత్యనారాయణ పాల్గొన్నారు.



పనిచేయాలంటే..
ఏడుపే!
సివిల్ సప్లయిస్‌లో ఏమి జరుగుతోంది..

- శాఖలో వింత పరిస్థితి
- రెండేళ్లలో ఏడో మేనేజర్
- కొత్త డీఎంగా టి.రాధిక
- నాయకుల పెత్తనమే కారణం
- తట్టుకోలేకపోతున్న అధికారులు
- వచ్చిన వెంటనే వెళ్లిపోతున్న వైనం
- పట్టించుకోని ఉన్నతాధికారులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్‌గా ఎవరూ పట్టుమని కొద్ది నెలలు కూడా పనిచేయలేకపో తున్నారు. జిల్లాల విభజన జరిగి ఇంకా రెండేళ్లు పూర్తి కాలేదు.. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్‌గా ఏకంగా ఏడో అధికారి నియమితులయ్యారు.ఈ నేపథ్య ంలో సివిల్ సప్లయిస్‌లో ఎందుకిలా జరుగుతుందనేది చర్చనీయాంశమైంది. గత ప్రభుత్వాల్లో సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్లు చాలా కాలం పనిచేసేవారు. కానీ జిల్లా ల విభజన తర్వాత తూర్పుగోదావరి జిల్లాలో విచిత్ర మైన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటి వరకూ ఆరుగురు డీఎంలు పనిచేయగా ప్రస్తుతం ఏడో మేనేజర్ నియమి తులయ్యారు. వైసీపీ ప్రభుత్వంలో అధికారుల కంటే మిల్లర్లు,వాటిని వెనుక ఉండి నడిపించే నేతలదే ఎక్కువ పెత్తనం. జిల్లాలో 5 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం పండుతుంటే కేవలం 2.7 లక్షల టన్నుల వరకూ మాత్రమే వైసీపీ ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా సేకరి స్తోంది. రైతుల నుంచి ధాన్యం సేకరించి కస్టమ్ మిల్లింగ్ రైసు కోసం మిల్లర్లకు ఇవ్వడం,వారి నుంచి 100 కేజీల (క్వింటా) ధాన్యానికి 67 కేజీల బియ్యం తీసుకోవాలి. ఇలా ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యం ఇచ్చినందుకు మొత్తం క్వింటాకు రూ.154 సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చెల్లిస్తుంది. ఇందులో మొత్తం ఏడు రకాల చార్జీలు ఉంటాయి.ఈ బియ్యాన్ని రేషన్ షాపులకు పంపిస్తారు. ఉభయగోదావరి జిల్లాల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బియ్యం పంపిస్తారు. ఇక్కడ పండిన కామన్ రకం ధాన్యం తీసుకుని కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)ను ఇవ్వాలి.దీని కోసం మిల్లుల కెపాసిటీ గుర్తించడం, గం టలకు ఎంత బియ్యం ఆడ గలవనే వివరాలు సేకరించి, వాటి కెపాసిటీ బట్టి ధాన్యం కేటాయించాలి. వారికి ధాన్యం కేటాయించే ముందు, వాటి విలువకు సరిపోయే బ్యాంక్ గ్యారంటీ కట్టించుకోవాలి. కానీ కొంత మంది మిల్లర్లు కెపాసిటీ లేకపోయినా, రాజకీయనేతలు, ఉన్నతా ధికారులపై ఒత్తిడి తెచ్చి సీఎంఆర్ అనుమతి పొందే స్తారు. ధాన్యం తీసుకున్న తర్వాత సుమారు 3 నెలల గడువు ఉంటుంది. ఈలోపు బియ్యం ఇచ్చేయాలి. కానీ కొందరు సకాలంలో ఇవ్వరు. ధాన్యాన్ని బయట అమ్మేసు కుంటారు.వేరే నాసిరకం ధాన్యం ఇతర ప్రాంతాల్లో తక్కువ ధరకు కొని తిరిగి సీఎంఆర్‌గా ఇస్తుంటారనే ఆరోపణ ఉంది. అంతేకాక ధాన్యాన్ని ఎక్కువ ధరకు బయటమార్కెట్‌లో అమ్మేసుకోవడమో లేక బియ్యాన్ని అమ్మేసుకోవడమో చేస్తుంటారు.ధాన్యాన్ని అమ్మేసుకుంటే మిల్లింగ్ చార్జీలు, ఇతర చార్జీలు మిగులే. బియ్యం అమ్ముకుంటే పెద్దఎత్తున లాభాలు వస్తాయి. దీని వల్ల రకరకాల మోసాలు చేస్తుంటారనే ప్రచారం ఉంది.ఈ పరిస్థితుల్లో ఇక్కడ అవినీతి అధికంగా ఉంటుంది. ప్రస్తుత ప్రభుత్వంలో మిల్లర్లు అందరూ ఓ వైసీపీ నేత చెప్పినట్టే చేయాల్సి వస్తుంది. అధికారులు కూడా వారు చెప్పినట్టే వినాలి. వాళ్లు తప్పు చేయ మంటే చేయాలి. ఎంత ఇబ్బంది ఉన్నా పనిచేయాలి. లేకపోతే బదిలీ అయి వెళ్లిపోవడమే.ఈ నేపథ్యంలో వీరి మీద తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. పైగా ఏమాత్రం పైవారు చెప్పినట్టు చేయకపోతే అంతే సంగతులు. అందుకేనేమో ఇక్కడ ఎవరూ ఎక్కువ కాలం పనిచేయలేకపోతున్నారు. 2022 ఏప్రిల్ నుంచి కొత్త జిల్లా అమలులోకి వచ్చిన సంగతి తెలిసిందే. అపుడు జిల్లా సివిల్ సప్లయిజ్ మేనేజర్ తులసి చేరారు. ఆమె కేవలం మూడు నెలలు పనిచేశా రు. ఆమెను బదిలీ చేసి, అంబేద్కర్ కోనసీమ జిల్లా మేనేజర్ తనూజను ఇక్కడకు బదిలీ చేశారు.ఆమె కొద్ది నెలలు ఎక్కువే పనిచేశారు. కానీ సమస్య ఇక్కడ వచ్చిందో కానీ ఆమె ఆకస్మికంగా సెలవు పెట్టేయడంతో పాటు,ఉద్యోగానికే రాజీనామా చేసి వెళ్లిపోవడం గమనా ర్హం. తర్వాత కుమార్ అనే అధికారి చేరి కొద్దిరోజులకే వెళ్లిపోయారు.తర్వాత నాగార్జునరెడ్డి అనే అధికారి జాయినయ్యారు. కేవలం కొద్ది రోజులే పనిచేసి వెళ్లిపో యారు. మళ్లీ కుమార్ అనే మేనేజర్‌గా వచ్చి, మళ్లీ కొద్దిరోజులు పనిచేశారు. కారణాలేంటోకానీ జిల్లా కలెక్టర్ ఆయనకు షోకాజు నోటీసులు ఇచ్చి, తర్వాత కొద్దిరోజుల కిందట ప్రభుత్వానికి సరెండర్ చేశారు. తర్వాత ప్రస్తుత డీఎస్‌వోను ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన ఇంకా కొనసాగుతున్నారు.ఈలోపు ఎన్నికల నేపథ్యంలో సాధా రణ బదిలీల్లో భాగంగా తాళ్లపూడి తహశిల్దార్ టి.రాధి కను ఇక్కడ జిల్లా మేనేజర్‌గా నియమించారు. ఆమె ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఈ రబీ సీజన్‌లో రెండు మూడు రోజుల్లో ఆమె బాధ్యతలు తీసుకోనున్నారు.ఆమె ఇప్పటి ఏడాది 10 నెలలో ఏడో మేనేజర్ బాధ్యతలు స్వీకరిస్తున్నట్టు అయింది. ఆమె ఎన్ని రోజులు పనిచేస్తారో చూడాలి మరి.

పురాతన సంపదను సంరక్షించాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజేంద్రసింగ్

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 1: కాకినాడ నగరంలోని పురాతన సంపదను, కట్టడాలను సంరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రామన్ మెగసెసె అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్రసింగ్ అన్నారు. వర్సిటీ ప్రాంగణంలో యూసీఈకే, ఐఎస్టీ విద్యార్థులతో వారసత్వ సంపద రక్షణ కోసం ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. జంగిల్ బుక్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ఓడీఎల్ డైరెక్టర్ మురళీకృష్ణ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజేంద్రసింగ్ మాట్లాడుతూ రాజస్థాన్ నీటి కొరత, గంగా ప్రక్షాళన, నీటి లభ్యతను అంచనా వేయడం, జోర్డాన్ జలాలకు సంబంధించిన సిరియా సంక్షోభం, భూమిలోని నీటిని సంరక్షించడంలో విద్యార్థుల పాత్ర వివరించారు. ఐక్యరాజ్యసమితి ప్రతినిధిగా ఆరుసార్లు సిరియాను సందర్శించిన అనుభవంతో విద్యార్థులకు పలు వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఐఎస్టీ డైరెక్టర్ ఎ.గోపాలకృష్ణ, డాక్టర్ సత్యాజీరావు, సత్య, మాజీ మేయర్ సరోజ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెగుళ్లతో మిర్చి పంట మటాష్



గన్నవరంలో మిర్చి పంటను పీకేస్తున్న కూలీలు

- విలీన మండలాల్లో 90 శాతం దెబ్బతిన్న మిర్చి
- ఆశతో పంటను కాపాడుకునేందుకు అనేక ప్రయత్నాలు
- అయినా ఫలితం దక్కక పంటను పీకేస్తున్న రైతులు
- ఆ పొలాల్లో మొక్కజొన్న, పొగాకు పంటల సాగు

ఎటపాక, ఫిబ్రవరి 1 : ఆరుగాలం కష్టపడి, రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి పంట దిగుబడుల కోసం ఎదురుచూస్తున్న మిర్చి రైతుల ఆశలు ఆడియాశలయ్యాయి. గత నాలుగేళ్లుగా వరుస నష్టాలను మూటగట్టుకుని ఈ ఏడాది గంపెడాశతో మిర్చిని సాగు చేశారు. ఈ ఏడాది కూడా మిర్చి రైతుకు కాలం కలిసిరాలేదు.. ఈ ఏడాది కూడా నష్టాన్ని చవిచూసే పరిస్థితి నెలకొంది.. విలీన మండలాల్లో ఈ ఏడాది సుమారు 6 వేల ఎకరాల పైనే మిర్చి పంట సాగు చేశారు. అయితే పంట సాగు చేసిన రెండు, మూడు నెలల కాలం తర్వాత మిర్చికు తెగుళ్లు ఆశించాయి. తెగుళ్లతో పంట ఎదుగుదల నిలిచి, పూత, మొదటి దశలో ఆగిపోయింది. దాంతో తెగుళ్లు సోకిన పంటకు రైతులు అనేక రకాల మందులు పిచికారీ చేసినా, ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. కొన్ని ప్రాంతాల్లో అక్కడక్కడ బాగున్నాయని భావించిన మిర్చి చేలకు డిసెంబరులో



గౌరిదేవిపేటలో మిర్చిపంటను పీకేసి పొగాకు సాగు చేసిన దృశ్యం

వచ్చిన తుపాన్ మరింత దెబ్బతీసింది. తుపాన్ దాటికి పూత రాలిపోయింది. ఇవేకాక పంటకు గతేడాది వ్యాపించిన నల్లితామర పురుగు కూడా పంటకు ఆశించడంతో మిర్చి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. దెబ్బతిన్న పంటను రైతులు వదులుకోక ఆశతో మందులు పిచికారీ చేస్తూ వచ్చారు. అదనపు పెట్టుబడులు తప్ప పంట లో ఎటువంటి మార్పు కన్పించకపోవడంతో రైతులు పంటపై చివరకు ఆశలు వదులుకుని దున్నేస్తున్నారు. ఎకరాకు 15 నుంచి 20 క్వింటాల దిగుబడి వచ్చే మిర్చి, తెగుళ్లతో ప్రస్తుతం 2,3 క్వింటాళ్లు మాత్రమే వచ్చే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ.లక్షన్నర పెట్టుబడులు పెట్టినట్లు చెబుతున్నారు. తెగుళ్ల సోకిన మూడు, నాలుగు నెలల పంటను కూడా పీకేస్తున్నారు. ఆ పొలాల్లో తిరిగి మొక్కజొన్న, పొగాకు వంటి పంటను సాగు చేస్తున్నారు.

తెగుళ్లు, నకిలీ విత్తనాలతో 3 ఎకరాల పంటను పీకేశా



ఈ ఏడాది ఐదు ఎకరాల్లో మిర్చిపంట సాగు చేశాను. ఇందులో మూడు ఎకరాల పంటకు తెగులు, నకిలీ విత్తనాలతో పంట మొత్తం దెబ్బతింది. మూడు ఎకరాలకు దాదాపు మూడున్నర లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టాను. క్వింటా దిగుబడి కూడా రాలేదు. మూడున్నర లక్షలు నష్టపోయా.. ఇక రైతులు మిర్చి సాగు చేసే పరిస్థితి ఉండదు.

● మందలపు శ్రీనివాసరావు, రైతు, గన్నవరం.

పెద్ద పులి సంచారంతో భయంభయం

- జల్లెడ పడుతున్న అధికారులు.. అయినా చిక్కని వైనం
- భయాందోళనలో వివిధ గ్రామాల ప్రజలు
- బయటకు రావద్దంటూ హెచ్చరికలు జారీ చేస్తున్న అధికారులు

గోపాలపురం, ఫిబ్రవరి 1: పెద్దపులి సంచారంతో మండలంలో ప్రజలు భయందోళనలు చెందుతున్నారు. నిన్న మొన్నటి వరకు ద్వారకా తిరుమల, నల్లజర్ల మండలాల్లోని అడవుల్లో సంచరించిన పెద్దపులి గురువారం ఉదయానికి దేవరపల్లి మండలం యాదవోలు, చిన్నాయిగూడెం గ్రామాల మధ్య సంచరించినట్లు అటవీ శాఖాధికారులు గుర్తించారు. దీంతో పంట గ్రామాల్లో టాంటాంలు వేయించి అటవీశాఖాధికారులు ప్రజలను అప్రమత్తం చేసే పనిలో పడ్డారు. ఒక పక్క పులి సంచారాన్ని అడుగడుగునా గమనిస్తున్న అటవీ శాఖాధికారులు మరో పక్క ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో యాదవోలు రెవెన్యూ పరిధి దాటి వాదాలకుంట గ్రామ శివారులో ఉన్న గాడి చెరువు సమీపంలోని గద్దే ఈశ్వరుడుకు చెందిన పొగాకు తోటలో పెద్దపులి జాడలు కనపడటంతో రైతులు భయందోళన చెందారు. ఈ విషయం అటవీశాఖాధికారులకు తెలియడంతో పులిని జాడలను వెంబడిస్తూ సాయంత్రానికి కరిచర్లగూడెం,



పులి పాదముద్రలు



జాడ కోసం అమర్చిన సీసీ కెమెరా

కోమటిగుంట గ్రామాల మధ్యలో ఉన్న మాతంగమ్మ మెట్ట వెనుక భాగంలో పెద్దపులి ఉన్నట్లు అటవీ శాఖాధికారులు గుర్తించారు. దీంతో కరిచర్లగూడెం, కోమటిగుంట, వాదాలకుంట, వెదుళ్లకుంట, జగన్నాథపురం, కరగపాడు, బుచ్చయ్యపాలెం గ్రామాల్లో టాంటాంలు వేయించి సాయంత్రం 5 గంటలు దాటితే ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దంటూ ఒంటరిగా తిరగవద్దని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా ఫారెస్ట్ రేంజ్ అధికారి ధర్మరాజు ఇచ్చిన వివరాల ప్రకారం గత పది రోజులుగా సంచరిస్తున్న పెద్దపులిని వెంబడిస్తున్నామని గురువారం సాయంత్రానికి కరిచర్లగూడెం, కోమటిగుంట గ్రామాల మధ్యలో ఉన్న మాతంగమ్మమెట్ట వద్దకు పెద్దపులి చేరినట్లు గుర్తించామన్నారు. తమ అంచనా ప్రకారం కరగపాడు మీదుగా పోలవరం పాపికొండల ప్రాంతానికి వెళ్లవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు.

తాడిపూడి ఇసుక ర్యాంపులో చిరుత

భయాందోళనలో స్థానికులు

తాళ్ళపూడి, ఫిబ్రవరి 1: తాళ్ళపూడి మండలం తాడిపూడి ఇసుక ర్యాంపులో గురువారం చిరుత పులి సంచరిస్తున్నట్లు పలువురు గుర్తించారు. గోదావరి తీరం వెంబడి నడుచుకుంటూ వెళ్లడాన్ని అక్కడ పని చేసే సిబ్బంది చూసి భయభ్రాంతులకు గురై పక్కనే ఉన్న షెడ్డులో దాక్కున్నారని తెలిపారు. దూరం నుండే నడుచుకుంటూ వెళ్లిన దృశ్యాన్ని వీడియోలో బంధించారు. చిరుత పులి తాళ్లపూడి గ్రామం వైపుగా వెళ్లిందని చెప్పడంతో గోదావరి తీర ప్రాంత వాసులు కాస్త జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. అంతేగాక జిల్లాలో తిరుగుతున్న ఈ పులుల బెడదతో ప్రజలు హడలిపోతున్నారు.

ఆటో-బైక్ ఢీ: ఇద్దరి మృతి



మాధవరావు (ఫైల్‌ఫోటో)



సంఘటన స్థలంలో మృతదేహాలు

కొత్తపేట, ఫిబ్రవరి 1: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం పలివెల శివారు చౌదరిపురం సమీపంలో గురువారం ఆటో బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా ఒకరికి తీవ్ర గాయాలైనట్టు ఎస్‌ఐ డి.జ్వాలా సాగర్ తెలిపారు. వివరాల ప్రకారం.. రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడు గ్రామానికి చెందిన చీమల మాధవరావు (43) తండ్రి నరసింహారావుతో కలిసి ద్విచక్ర వాహనంపై కొత్తపేట మండలం వాడపాలెంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో పలివెల మీదుగా ముమ్మిడివరప్పాడు బయల్దేరారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలానికి చెందిన ఆటో డ్రైవర్ బండి మోషే (35) ప్రయాణికులు లేని ఆటోతో పలివెల సమీపంలోని కూలీలను ఎక్కించుకునేందుకు వస్తున్నాడు. చౌదరిపురం సమీపంలో మాధవరావు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆటో డ్రైవర్ నేరుగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న మాధవరావు, ఆటో నడుపుతున్న మోషే అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ అక్కడకు చేరుకుని తీవ్రంగా గాయపడిన నరసింహారావును మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు. మృతదేహాలను కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మాధవరావు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ జ్వాలాసాగర్ తెలిపారు.

పలువురు డీఎస్పీలు బదిలీలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం జిల్లాలోని డీఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేసింది. స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ డి.రామవర్మను అనకాపల్లి డీటీసీకి పంపించారు. నాలుగున్నరేళ్ల నుంచీ ఆయన అదే పోస్టులో కొనసాగుతున్నారు. ఆయన స్థానంలో కాకినాడలోని ఏపీఎస్పీ మూడో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ బి.అప్పారావును నియమించారు. సీఐడీ డీఎస్పీ బి.రామకృష్ణను రామచంద్రాపురం ఎస్‌డీపీవోగా, డీఎస్పీ క్రైమ్స్ జీసీ గురునాథ్‌బాబును సత్తెనపల్లి ఎస్‌డీపీవోగా, కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మను నరసారావుపేట ఎస్‌డీపీవోగా, రాజమండ్రి సౌత్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులును నార్త్ జోన్‌కి, డీసీఆర్‌బీ డీఎస్పీ ఎ.శ్రీనివాసరావును సత్యసాయి జిల్లా దిశాకు, చిత్తూరు ఎస్‌డీపీవో కె.శ్రీనివాసమూర్తిని రాజమండ్రి క్రైమ్స్ డీఎస్పీగా, సత్తెనపల్లి ఎస్‌డీపీవో బి.ఆదినారాయణను తూర్పుగోదావరి దిశా డీఎస్పీగా బదిలీ చేశారు. రాజమండ్రి రైల్వే పోలీస్ డీఎస్పీ (డీఎస్ఆర్‌పీ), టీవీఎస్ నాగేశ్వరరావు విజయవాడ డీఎస్ఆర్‌పీగా వెళ్లగా ఆయన స్థానంలో డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న ఎల్.మోహన్‌రావును నియమించారు.

సౌత్‌జోన్ సైన్స్‌ఫెయిర్‌లో ప్రత్యేక బహుమతి



చైతన్యకు ప్రత్యేక బహుమతి అందిస్తున్న దృశ్యం

బిక్కవోలు, ఫిబ్రవరి 1: విజయవాడలో జరిగిన సౌత్‌జోన్ సైన్స్ ఫెయిర్‌లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొన్న తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం పందలపాక ఉన్నత పాఠశాలకు చెందిన కెఎల్ఎస్ చైతన్య ప్రత్యేక బహుమతి గెల్చుకున్నాడని హెచ్ఎం శ్రీనివాసరెడ్డి తెలిపారు. వివిధ రాష్ట్రాలు పాల్గొన్న ఈ సైన్స్ ఫెయిర్‌లో చైతన్య లైఫ్ సేవింగ్ లోకాస్ట్ వెంటిలేటర్‌ను ప్రదర్శించి ఎస్ఈఆర్‌టీ డైరెక్టర్ పి.ప్రతాపరెడ్డి, ఎండీఎం డైరెక్టర్ షోభికా, ఆర్‌జేడీ నాగమణి నుంచి ప్రత్యేక బహుమతి తీసుకున్నాడన్నారు. ఈ సందర్భంగా చైతన్యను, గైడ్ టీచర్ శ్రీనివాసుల రెడ్డిని పలువురు అభినందించారు.

ఇకపై అమృత్‌భారత్ స్టేషన్ పనులు వేగవంతం

సామర్లకోట, ఫిబ్రవరి 1: కేంద్ర బడ్జెట్‌లో విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని కాకినాడ, తుని, నిడదవోలు రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయి. బడ్జెట్‌లో అమృత్‌భారత్ స్టేషన్లకు మరిన్ని నిధులు కేటాయించడంతో పనులు పరుగులు పెట్టనున్నాయి. గత ఏడాది ఆగస్టు 6న వర్చువల్ విధానంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ భూమి పూజలు ప్రారంభించిన విషయం తెలిసిందే. అందులో కాకినాడకు రూ.11.50 కోట్లు, తుని స్టేషన్‌కు రూ. 9.50 కోట్లు నిధుల కేటాయింపులు జరగగా శుక్రవారం నాటి బడ్జెట్ కేటాయింపులలో అమృత్‌భారత్ స్టేషన్ల అభివృద్ధికి సంబంధించి నిధుల విడుదలకు లైన్‌క్లియర్ అయ్యింది. తూర్పుగోదావరి జిల్లాలోని నిడదవోలుకు రూ. 19.33 కోట్లు విడుదల కానున్నట్లు రైల్వే ఉన్నతాధికారి గురువారం రాత్రి చెప్పారు. ఇవి గాకుండా విజయవాడ డివిజన్ పరిధిలో మరో 8 రైల్వే స్టేషన్లకు అమృత్‌భారత్ పథకంలో నిధులు విడుదల కానున్నాయి. అలాగే విజయవాడ-విశాఖ మధ్య మూడో ట్రాక్ పనులు గురువారం నాటి బడ్జెట్ నిధుల కేటాయింపులతో మరింత వేగవంతం కానున్నాయి. చిరకాల వాంఛగా ఉన్న మూడో ట్రాక్ పనులు ఇప్పటికే చెన్నై నుంచి గుంటూరు వరకూ దాదాపు పూర్తయినట్లు సమాచారం. గత ఏడాది రైల్వే జీఎం సైతం సామర్లకోట నుంచి ఇటు విశాఖకు, అటు విజయవాడ మధ్య మూడో ట్రాక్ ఏర్పాటుకు ప్రస్తుత ట్రాక్ సామర్థ్యాన్ని సైతం విండో సీయింగ్ ద్వారా పరిశీలించిన విషయం విధితమే. తాజాగా గురువారం నాటి రైల్వే బడ్జెట్‌లో మూడో ట్రాక్ పూర్తికి కూడా నిధుల కేటాయింపులు జరగగలవని రైల్వే అధికారులు చెప్పారు. కాగా ఆంధ్రా-తెలంగాణా మధ్య దూరాన్ని మరింత దగ్గర చేసేందుకు కొవ్వూరు-భద్రాచలం మధ్య నూతన రైల్వే లైన్ నిర్మాణానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు జరుగుతాయని కొండంత ఆశతో ఎదురుచూపులు చూసిన ఈ ప్రాంత ప్రయాణికులు బడ్జెట్‌లో దీనిపై ఏమాత్రం ప్రస్తావించకపోవడం పట్ల తీవ్ర నిరాశ చెందాల్సి వచ్చిందని జడ్ఆర్‌యూసీసీ సభ్యుడు యార్లగడ్డ దశరథ రామారావు చెప్పారు.

ఖాతాల్లో డబ్బులు మాయమవుతున్నాయి

బయోమెట్రిక్, ఈకేవైసీ అనంతరం సొమ్ములు ఆటోమేటిక్‌గా మాయం

లబోదిబోమంటూ బ్యాంకులకు పరుగులు తీసిన ఖాతాదారులు



పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

రావులపాలెం, ఫిబ్రవరి 1: గ్రామాల్లో కులగణన పేరిట సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి సర్వే చేపట్టారు. ఆ సమయంలో బయోమెట్రిక్‌తో వేలిముద్రలను తీసుకుంటున్నారు. అయితే అనంతరం బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు మాయమవుతున్నాయని పలువురు ఖాతాదారులు వాపోతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలంలో ఇలా బ్యాంకు ఖాతాల్లో సొమ్ము మాయంపై బాధితులు బ్యాంకు అధికారులు, పోలీసులను ఆశ్రయిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కులగణన సర్వేకు సంబంధించి వేలిముద్ర వేసిన అనంతరం కొందరికి పది నిమిషాలు, కొందరికి రోజు వ్యవధిలో వారి ఖాతాల్లో నగదు మాయమవుతుండడంతో బాధితులు ఆందోళనకు గురవుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ-కేవైసీ చేసిన అనంతరం కూడా బ్యాంకు ఖాతాల్లోని నగదు వారి ప్రమేయం లేకుండానే మాయమవుతోంది. బాధితులు బ్యాంకులకు వెళ్లి అధికారులను అడుగుతున్నారు. మీరు ఎక్కడైనా బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు వేశారా అని వారు తిరిగి ప్రశ్నిస్తున్నారు. కులగణనకు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈకేవైసీ సమయంలోను బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు వేశామని బాధితులు తెలిపారు. ఇది సైబర్ క్రైమ్ అని... దీనిపై పోలీసులను ఆశ్రయించమని బ్యాంకు అధికారులు సూచించారు. ఇప్పటి వరకు మొబైల్‌కు నగదు విత్‌డ్రా అయినట్లు మెసేజ్ వచ్చిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఇదంతా చూస్తే బాధితులు వందల సంఖ్యలో ఉన్నట్టు సమాచారం. మండల పరిధిలోని పొడగట్లపల్లి, ఈతకోటల్లో కులగణన పేరిట వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సర్వే నిర్వహించారు. అనంతరం ఐదు గంటల వ్యవధిలో రూ.9,900, రూ.5 వేలు, రూ.1,300, రూ.1,300 నగదు వారి ఖాతాల నుంచి మాయమైంది. రావులపాలెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ-కేవైసీ అనంతరం తమ ఖాతాల్లో రూ.5వేలు, రూ.9,900 చొప్పున నగదు మాయమైందని సుమారు ఐదుగురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పొడగట్లపల్లికి చెందిన పోలవరపు శ్రీనివాస్, ఈతకోటకు చెందిన మానే ప్రసాద్ మరి కొందరు బాధితులతో కలిసి తమకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైసీపీ ప్రభుత్వం వలంటీరు వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రతి పథకానికీ వేలిముద్రలు తీసుకుంటోంది. వ్యక్తిగత సమాచారాన్ని బట్టబయలు చేస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపించారు. వేలిముద్రలు తీసుకోకుండా కులగణన సర్వే నిర్వహించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఉత్తుత్తి డీఎస్సీలెందుకు?

ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రినాథ్‌బాబు

రాజానగరంలో ఎస్టీయూ నిరసన ప్రదర్శన

రాజానగరం, ఫిబ్రవరి 1 : ప్రభుత్వం ఇన్ని రోజులూ మెగా డీఎస్సీ అని ఊదర గొట్టి ఇప్పుడు కేవలం ఆరువేల పోస్టులతో ఉత్తుత్తి డీఎస్సీ నిర్వహించాలనుకోవడం నిరుద్యోగులను దగా చేయడమేనని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.జె.త్రినాథ్‌బాబు ఆరోపించారు. రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల పట్ల ఆయన నిరసన వ్యక్తం చేస్తూ ఎస్టీయూ ఆధ్వర్యంలో రాజానగరంలోని గాంధీ విగ్రహం వద్ద సంఘ సభ్యులతో కలిసి కొవ్వొత్తులు, ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా 50 వేల పోస్టులకు డీఎస్సీ నిర్వహిస్తామని ఊదర గొట్టిన ప్రభుత్వం కేవలం 6 వేలు పోస్టులతో డీఎస్సీ నిర్వహిస్తామని ఉసూరుమనిపించడం సరికాదన్నారు. ఉపాధ్యాయ సంఘాలు దశాబ్దాల తరబడి పోరాటం సాగించి రద్దు చేయించిన అప్రంటీస్ విధానాన్ని మళ్లీ తెరపైకి తీసుకురావడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. పాత పెన్షన్ విధానం పునరుద్దరణకు సంబంధించి పునరాలోచన చేయకపోవడం విచారకరమన్నారు. వేతన సవరణ కమిటీ ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నా ప్రయోజనం లేదని, కనీసం మధ్యంతర భృతిపై చర్చించకపోవడం ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలపై ప్రభుత్వ నిర్లక్ష వైఖరికి నిదర్శనమని ఆక్షేపించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు బండి ధర్మరాజు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఆర్థిక కార్యదర్శి వీరబాబు, జిల్లా నాయకులు భీమేశ్వరరావు, శైలజ, మండల నాయకులు చిన్నా మాస్టారు, గీత, వీరబాబు, ఉదయభాను, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో అంతర్జాతీయ సదస్సు

గండేపల్లి, ఫిబ్రవరి 1: సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 2, 3 తేదీల్లో ఇంజనీరింగ్ అనువర్తనాల అల్గారిథమ్‌లు, గణన సిద్ధాంతం అనే అంశం మీద ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ జరుగుతుంది. వివిధ దేశాలకు, రాష్ట్రాలకు చెందిన అనేక మంది అభ్యర్థులు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొనబోతున్నారు. మొదటి రోజు ఉదయం కాన్ఫరెన్స్‌లో జేఎన్టీయూకే సీఎస్ఈ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎం.హెచ్ఎం కృష్ణప్రసాద్ ముఖ్య ఉపన్యాసకులుగా, మధ్యాహ్నం ఎన్ఐటీ పుదుచ్చేరిలో సీఎస్ఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.సురేంద్రన్ ముఖ్య ఉపన్యాసకులుగా పాల్గొనబోతున్నారు. రెండో రోజు కాన్ఫరెన్స్‌లో ముఖ్య ఉపన్యాసకులుగా మలేషియాలో యూనివర్సిటీ టెక్నాలజీ పెట్రోనస్‌లో ఈఈఈ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఇర్రైవన్ ఇలాం వరుతీ పాల్గొంటున్నారని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

పురోహితులు బ్యాట్ పట్టారు



క్రికెట్ ఆడుతున్న పురోహితులు

అంబాజీపేట, ఫిబ్రవరి 1: నిత్యం పూజలతో బీజీగా ఉండే పురోహితులు క్రికెట్ ఆడారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట జడ్పీ హైస్కూల్‌లో గురువారం పంచెకట్టులో పురోహితులు సిక్సులు, ఫోర్లు బాదారు. రాష్ట్రస్థాయి పురోహిత క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం హోరాహోరీగా జరిగింది. క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌లో రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెందిన 8 టీమ్స్ పాల్గొన్నాయి. నాలుగు జట్లు విజేతగా నిలిచాయని టోర్నీ నిర్వాహకులు తెలిపారు. ఖమ్మం, కాకినాడ, విజయవాడ, కొవ్వూరు క్రికెట్ జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. శుక్రవారం ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

నవోదయ అడ్మిట్ కార్డుల విడుదల

పెద్దాపురం, ఫిబ్రవరి 1: జవహర్ నవోదయలో 9, 11 తరగతిలో లేటరల్ ఎంట్రీ ప్రవేశపరీక్ష అడ్మిట్ కార్డులు విడుదలైనట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ ఆర్.కమలం చెప్పారు. 9,11 తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 10న ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని ఆయన చెప్పారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.45 గంటల వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు నవోదయ వెబ్‌సైట్ నుంచి అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన అభ్యర్థులకు పెద్దాపురం, సామర్లకోట పట్టణాల్లో ఆరు కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందన్నారు.

ఎంపీడీవోలకు మండలాల కేటాయింపు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 1: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పలువురు ఎంపీడీవోలను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు విశాఖ జిల్లా నుంచి 18 మందిని, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 13 మందిని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ చేయగా మొత్తం 31 మంది ఎంపీడీవోలకు మండలాలు కేటాయిస్తూ జిల్లా పరిషత్ సీఈవో ఎ.రమణారెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా విశాఖ జిల్లా నుంచి వచ్చిన ఎంవీ సువర్ణరాజు (దేవీపట్నం), వీవీ రవికుమార్ (అనపర్తి), వి.హేమసుందరావు (కోరుకొండ), కె.వసంత (గోకవరం), వి.విజయలక్ష్మి (బిక్కవోలు), మేరీ జోసీ (ఆలమూరు), కేవీ నరసింహారావు (ముమ్మిడివరం), ఎన్వీ రామచంద్రమూర్తి (రామచంద్రపురం), ఎం.విజయకుమార్ (శంఖవరం), ఎ.జయప్రకాశరావు (గొల్లప్రోలు), ఎస్‌డీ శ్యామ్ సుందర్ (సామర్లకోట), ఎస్.డేవిడ్‌రాజు (ప్రత్తిపాడు), ఎస్.జయమాధవి (కోటనందూరు), ఎస్.హనుమంతరావు (గండేపల్లి), కె.ప్రభాకరరావు(తాళ్లరేవు), బి.రమేష్ నాయుడు (కాకినాడ రూరల్), పి.ఆశాజ్యోతి (పెదపూడి), ఎం.ఉషారాణి (పెద్దాపురం) ఎంపీడీవోలుగా నియమితులయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి వచ్చిన ఎం.మురళీకృష్ణ (ఎటపాక), జీఏకేఎస్‌వీ జ్యోతిర్మయి (రాజానగరం), జీఆర్ మనోజ్ (కడియం), కేఆర్ఎస్ కృష్ణప్రసాద్ (సీతానగరం), కె.శ్రీదేవి (కాట్రేనికోన), ఎస్.వేణుగోపాలరెడ్డి(మామిడికుదురు), ఎస్.వెంకటేశ్వరరావు (ఆత్రేయపురం), కె.వాణి(కొత్తపేట), ఎండీ అమీలు జమాహ్ (ఐ.పోలవరం), కె.వెంకటలక్ష్మి (రాయవరం), సీహెచ్ త్రిశూల (పి.గన్నవరం), ఎ.శ్రీనివాస్ (రావులపాలెం), టి.సూర్యనారాయణమూర్తి (అయినవిల్లి) ఎంపీడీవోలుగా నియమించారు.


జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత

టీడీపీ-జనసేన కూటమికి 140 అసెంబ్లీ సీట్లు: చిన్నయ్యదొర



బర్కత్‌పుర, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో పూర్తి వ్యతిరేకత ఉందని ఉమ్మడి ఏపీ మునిసిపల్ కౌన్సిల్ చాంబర్ మాజీ చైర్మన్ గొరకపూడి చిన్నయ్యదొర అన్నారు. జగన్ మాటలు నమ్మి అన్ని వర్గాల ప్రజలు నష్టపోయారని వచ్చే ఎన్నికల్లో వైసీపీని భూస్థాపితం చేయడమే లక్ష్యంగా ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో చిన్నయ్యదొర విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ జనసేన కూటమికి ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తుందని వచ్చే ఎన్నికల్లో 140 అసెంబ్లీ సీట్లు సాధించి ఈ కూటమి అధికారంలోకి రాబోతోందని దీనిని ఎవరూ అడ్డుకోలేరని స్పష్టం చేశారు. కోటి యాభై లక్షల మందికి సంక్షేమ పథకాలు అందించామని సీఎం జగన్ అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ధరల పెరుగుదలను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. చంద్రబాబును అరెస్టు చేసి జైలుకు పంపినప్పుడే జగన్ రాజకీయ కుట్రకోణం బయటపడిందని దీనిని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారని చిన్నయ్యదొర తెలిపారు.

ఓటు వేయాలంటే ఎంతో కష్టం!



ఇలా రావాల్సిందే..

మోతుగూడెం, ఫిబ్రవరి1: అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న చదలవాడ గ్రామ పంచాయతీ పరిధిలో అతి మారుమూల గ్రామమైన ఏరువాడ గ్రామస్థులు ఓటు వేయాలంటే పెద్ద పెద్ద వాగులు, వంకలు ఎత్తైన గుట్టలు దాటి రావాల్సిందే. ఏరువాడ గ్రామంలో 106 మంది నివసిస్తున్నారు. ఈ గ్రామంలో 45 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా చదలవాడ తులసిపాక వచ్చి ఓటు వేయాలి. సుమారు 11 కిలోమీటర్లు దూరం దట్టమైన అడవిమార్గం ద్వారానే వాగులు దాటి వచ్చి ఓటు వేయాల్సి ఉంది. ప్రతి ఎన్నికల సమయంలో అక్కడ ఓటర్లు ఇలా వచ్చి ఓట్లు వేస్తున్నారు. ఈ సారైనా గ్రామస్థుల కష్టాలు తీర్చేందుకు ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు కోసం గ్రామస్థుల ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న గ్రామస్థులు

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 1: ఆర్అండ్‌బీ రహదారిని ఆధునికీకరించాలంటూ జనం రోడ్డెక్కారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం చల్లపల్లిలో ఓఎన్జీసీ చమురు ట్యాంకర్లను అడ్డుకుని ఆందోళనకు దిగారు. అమలాపురం-ఎస్.యానాం రహదారి నిర్వహణ బాధ్యత రవ్వ, ఓఎన్జీసీ జాయింట్ వెంచర్‌దేనన్న సంగతి తెలిసిందే. కేజీ బేసిన్ పరిధిలోని ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల చమురు బావుల నుంచి ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం అన్‌లోడింగ్ పాయింట్‌కు రోడ్డు మార్గంలో ట్యాంకర్ల ద్వారా ముడి చమురు రవాణా జరుగుతోంది. ఈ కారణంగా ఆర్అండ్‌బీ రహదారి తరచూ గోతులు పడి శిథిలావస్థకు చేరడం సాధారణమై పోయింది. గతంలో స్థానిక ప్రజల ఆందోళన ఫలితంగా ఈ రహదారి నిర్వహణ బాధ్యత తమదేనని చమురు సంస్థలు ఉన్నతాధికారుల సమక్షంలో రాతపూర్వకంగా అంగీకరించాయి. అయితే ఇటీవల రహదారి గోతులమయంగా మారిందని, ఎన్నోసార్లు ఫిర్యాదు చేయగా కొంత మేర గోతులను తాత్కాలికంగా పూడ్చి చేతులు దులుపుకున్నారన్నది ఆందోళనకారుల ఆరోపణ. నెల రోజుల్లో గోతుల్లో పడి నలుగురు గాయపడ్డారని, తక్షణం రహదారిని ఆధునికీకరించాలని డిమాండ్ చేస్తున్నారు. రవ్వ యాజమాన్యాన్ని అడిగితే ఆర్అండ్‌బీకి నిధులిచ్చామంటున్నారని, ఆర్అండ్‌బీ అధికారులు నిధుల సంగతి తమకు తెలియదంటున్నారని ఆందోళనకారులు అంటున్నారు. అసలు విషయం తేలే వరకు ఓఎన్జీసీ వాహనాలను కదలినిచ్చేదిలేదని స్పష్టం చేశారు. సర్పంచ్ ఇసుకపట్ల జయమణిరఘుబాబు, ఉప సర్పంచ్ చీకురుమెల్లి సత్యనారాయణ, దంగేటి బాబులు, భోగిశెట్టి నర్సింగ్, ఆకుల జోగయ్యనాయుడు, సుంకర చిన్నా తదితరులు ఆందోళనకు నాయకత్వం వహించారు.

ఏజెన్సీ సమాచారం

సచివాలయ భవనాలు పూర్తయ్యేదెన్నడు?



అసంపూర్తిగా సచివాలయం



బరదనాంపల్లిలో..

రాజవొమ్మంగి ఫిబ్రవరి 1: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సచివాలయ భవన నిర్మాణాలు ఎన్నికలు సమీపిస్తున్నప్పటికీ పూర్తికాలేదు. రాజవొమ్మంగి మండలంలో సచివాలయం, రైతు భరోసా, వెల్‌నెస్ సెంటర్ భవనాల నిర్మాణాలు దాదాపు అన్ని గ్రామల్లో 2020వ సంవత్సరంలో మొదలుపెట్టారు. అయితే మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా 18 భవనాలు నిర్మాణం ప్రారంభించగా ఇప్పటికి (2024)కి ఒక్క సచివాలయ భవనం మాత్రమే నిర్మాణం పూర్తి చేసి సంబంధిత అధికారులకు అప్పగించారు. గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ద్వారా 2020వ సంవత్సరంలో మండలంలో 18 ప్రభుత్వ భవనాలు నిర్మాణం ప్రారంభం కాగా ఇప్పటికే 16 భవనాలు నిర్మాణాలు పూర్తి చేశారు. కానీ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించిన 18 భవనాలకు ఒక్క భవనం మాత్రమే పూర్తి కావడంపై ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే 2020వ సంవత్సరంలో భవన నిర్మాణాలు మొదలుపెట్టినా నేటికి పూర్తి కాలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ నిర్మాణాలకే మెటీరియల్ వర్క్ నిధులు కేటాయించారు. దీంతో ఉపాధి పథకంలో చాలా గ్రామాల్లో వేరే వర్క్‌లు చేసేందుకు వీలుపడడం లేదు. అలా అని ఈ గ్రాంట్ తో నిర్మిస్తున్న సచివాలయ భవనాలు కూడా పూర్తి కాలేదు. దీనిపై గతంలో అనేక సార్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అన్ని పార్టీల నాయకులు అసహనం వ్యక్తం చేశారు. అయితే పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా ప్రారంభమైన నిర్మాణాలు ఇప్పటికీ పూర్తి కాకపోవడానికి అధికారుల పర్యవేక్షణ లోపమే కారణం అని ప్రజలు అంటుంటే సంబంధిత అధికారులు మాత్రం బిల్లులు అవ్వకే పనులు జరగట్లేదంటున్నారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్‌శాఖ ద్వారా భవన నిర్మాణాలు చేస్తున్న కాంట్రాక్టర్లకు సుమారు 60లక్షల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని రాజవొమ్మంగి ఇంచార్జ్ పీఆర్ జేఈ రవితేజ తెలిపారు.

గంజాయి సాగుకు, రవాణాకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

మోతుగూడెం, ఫిబ్రవరి 1: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి పరిధిలో బచ్చులూరు, నర్సింగ్‌పూర్, బిర్రిగుడా గ్రామాల్లో వారికి గంజాయి సాగు వద్ద రవాణా వద్ద అంటూ అవగాహన సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ తూహిన్‌సిన్హా, రంపచోడవరం ఓఎస్డీ కేవీ మహేశ్వర్‌రెడ్డి, చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనా, చింతూరు గజేంద్ర ఆదేశాల మేరకు డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న బచ్చులూరు, నర్సింగ్‌పూర్, బిర్రిగుడా గ్రామాల్లో డొంకరాయి ఎస్ఐ శివకుమార్ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా చూసుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లరాదన్నారు. గంజాయి జోలికి పోకుండా కష్టపడి పని చేసే తత్వం అలవర్చుకోవాలన్నారు. క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. అనంతరం ఆయా గ్రామ యువతకు వాలీబాల్ కిట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బొడ్డగండి సర్పంచ్ మేమా సంధ్యారాణి, వలంటీర్లు, హెడ్ కానిస్టేబుల్ కళ్యాణ్, కానిస్టేబుల్స్ పోసయ్య, గంగరాజు పాల్గొన్నారు.

తహసీల్దార్ శ్రీనివాసరావు సేవలు అభినందనీయం

వై.రామవరం, ఫిబ్రవరి 1: వై.రామవరం తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావు మండలంలో విశిష్టమైన సేవలు అందించారని సిబ్బంది కొనియాడారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలానికి బదిలీ అయిన ఆయనను గురువారం కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కె.సుధాకర్, ఆర్ఐ కీర్తనాగీతావిలాషా, సీనియర్ అసిస్టెంట్ తాతారెడ్డి, వీఆర్వో, వీఆర్ఏలు పాల్గొన్నారు.

కూనవరం తహసీల్దార్‌గా మురళీకృష్ణ

కూనవరం, ఫిబ్రవరి 1: కూనవరం తహసీల్దార్‌గా ఆర్‌వీ మురళీకృష్ణ బదిలీపై నియమితులయ్యారు. ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ అనసూయ స్థానంలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. అనసూయ రెండున్నర సంవత్సరాలు కూనవరంలో పనిచేశారు. ఇక్కడికి బదిలీ అయిన మురళీకృష్ణ పశ్చిమగోదావరి జిల్లాలో పనిచేశారు.

రాజవొమ్మంగి సీఐగా సన్యాసినాయుడు



రాజవొమ్మంగి, ఫిబ్రవరి 1: రాజవొమ్మంగి పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.సన్యాసినాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇప్పటివరకు రాజవొమ్మంగి సీఐగా విధులు నిర్వహించిన స్వామి నాయుడు బదిలీ కాగా, పాడేరులో దిశ సీఐగా చేసిన సన్యాసినాయుడు రాజవొమ్మంగి బదిలీ అయ్యారు. నూతన సీఐ సన్యాసినాయుడుకు అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ శిబిరానికి వీజే కళాశాల విద్యార్థి ఎంపిక



ఆంధ్రవిశ్వవిద్యాలయం వీసీ ప్రసాదరెడ్డిని కలసిన విద్యార్థుల బృందం

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 1: పంజాబ్‌లోని చిత్కారా విశ్వవిద్యాలయంలో జరుగనున్న ఎన్.ఎస్.ఎస్. జాతీయ శిబిరానికి స్థానిక వీజే ఫార్మసీ కళాశాల విద్యార్థి దవర సింగి భరద్వాజ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డి.నరేంద్ర గురువారం తెలిపారు. ఈనెల 5 నుంచి 11వతేదీ వరకూ చిత్కారా విశ్వవిద్యాలయంలో ఈ శిబిరం జరుగుతుందని చెప్పారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం పరిధిలోని ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో చదువుతున్న పదిమంది విద్యార్థినీ విద్యార్థులు ఈ ఎన్.ఎస్.ఎస్. జాతీయ శిబిరానికి వెళుతు న్నారన్నారు. ఈ విద్యార్థుల బృందం ఏయూ వీసీ పి.వి.జి.డి. ప్రసాదరెడ్డిని గురువారం కలిసిందని వీసీ వారికి పలు సూచనలు చేశారని నరేంద్ర తెలిపారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 1: రాజమహేంద్రవరంలో గురువారం బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయాన్ని రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. రాష్ట్రంలో 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల కార్యాలయాలు ఏర్పాటు చేసినట్టు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లల మర్రి మురళీకృష్ణ తెలిపారు. ఈ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రేలంగి శ్రీదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరిమి రాధాకృష్ణ, జాస్తి మూర్తి, అడబాల రామకృష్ణ, కొల్లివలస హారిక, ధార్మిక సెల్ రాష్ట్ర కన్వీనర్ సత్యగోపీనాథ్ దాస్, రొంగల గోపి శ్రీనివాస్, కురగంటి సతీష్, కాలెపు సత్యసాయిరామ్‌పాల్గొన్నారు.

పెండింగ్ పనులపై కమిషనర్‌తో చర్చించిన గోరంట్ల



కమిషనర్‌తో చర్చిస్తున్న రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 1: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులపై కమిషనర్ దినేష్ కుమార్‌తో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి చర్చించారు. ఆల్కట్ గార్డెన్స్‌లోని మెయిన్ డ్రైనేజీ పనులను వేగవంతం చేయాలని అది వర్షానికి వచ్చిన నీరు నేరుగా గోదావరిలోకి చేరవేస్తుందని దాని వల్ల రైల్వేస్టేషన్ ప్రాంతాలు ముంపునకు గురికాకుండా ఉంటాయని గోరంట్ల అన్నారు. ఆల్కట్ గార్డెన్స్ లోని ఇంకా చాలా ఇళ్లకు తాగునీరు కనెక్షన్ ఇవ్వలేదని దానిపై దృష్టి సాధించాలని కోరారు. టిడ్కో ఇళ్లకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. గోదావరి నీటి మట్టం తగ్గాక అన్ని ఘాట్లను యంత్రాలతో శుభ్రం చేయించాలన్నారు. అనంతరం కమిషనర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ గతంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రతిపాదించిన పనులపై దృష్టి సారిస్తామని చెప్పారు.



ప్రమాణస్వీకారంలో పాల్గొన్న ఆదిరెడ్డి వాసు



అనపర్తి: దుప్పలపూడిలో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న సిరసపల్లి

మహిళా సంక్షేమమే టీడీపీ ధ్యేయం

• నగర మహిళ, అంగన్వాడి కమిటీ ప్రమాణస్వీకారంలో నేతలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 1: మహిళా సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం తాడితోటలోని రవణం శ్రీరాములు కల్యాణ మండపంలో గురువారం నగర తెలుగు మహిళా కమిటీ, అంగన్వాడీ కమిటీలతో ప్రమాణ స్వీకారం చేయించారు. సమాజంలో మహిళలు శక్తివంతులుగా ఎదగడానికి టీడీపీ అధినేత చంద్రబాబు సంస్కరణలే కారణమన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాస్, బీసీ సీనియర్ నాయకులు రెడ్డి రాజు, ఛాంబర్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, టీడీపీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, నగర అధ్యక్షుడు రెడ్డి మణి, తెలుగుమహిళా పార్లమెంట్ కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, నగర తెలుగు మహిళా అధ్యక్షురాలు కొసూరి చండీప్రియ, నగర అంగన్వాడీ అధ్యక్షురాలు బోను ఈశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన కూటమి విజయం ఖాయం

• జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు సిరసపల్లి

అనపర్తి, ఫిబ్రవరి 1: వచ్చే సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం జనసేన కూటమి రాష్ట్రంలో 160 స్థానాలలో విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయ మని జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని దుప్పలపూడి గ్రామంలో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి మినీమేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు చిర్ల గంగిరెడ్డి, కుంత్సం కాశీవిశ్వేశ్వరరావు, నల్లమిల్లి వెంకటరెడ్డి, నిరీక్షణరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఉచ్చులో పడకండి

• జనసైనికులకు బత్తుల దిశా నిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల బలరామకృష్ణ

కోరుకొండ, ఫిబ్రవరి 1: రాజానగరం నియోజకవర్గం అసెంబ్లీ స్థానాన్ని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ జనసేనకు ప్రకటించడంతో జనసైనికులు ఆనందోత్సాలతో ఉండగా టీడీపీ శ్రేణులు డీలా పడినట్లు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఇరువురు మధ్య విభేదాలు సృష్టించేందుకు వైసీపీ ఎత్తులు పై ఎత్తులు వేస్తూ రెచ్చగొట్టే ధోరణిలో మాట్లాడినా జనసైనికులు ఎవరూ సంయమనం కోల్పోవద్దని జనశ్రేణులు బత్తుల బలరామకృష్ణ దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు కోరుకొండ పార్టీ కార్యాలయంలో మండల జనసైనికులతో సమావేశం అయ్యారు. టీడీపీ పార్టీ శ్రేణులతో మర్యాదగా మెలగాలని, వారు ఎవరు ఏమన్నప్పటికీ మీరు ఎవరూ స్పందించకుండా కలిసి మెలసి మెలగాలని మనకు గెలిపే లక్ష్యంగా పనిచేయాలని జనసైనికులు సూచించారు. టీడీపీలోనే 60వేల ఓట్లు, మన 80వేల ఓట్లు కలిస్తే మంచి మెజార్టీతో రాజానగరం నుంచి జనసేన అభ్యర్థిని గెలిపించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కమిడి శ్రీరాం, అడపా శ్రీనివాస్, బత్తుల గోపాలకృష్ణ, యర్రంశెట్టి పోలారావు, దేవన దుర్గాప్రసాద్, బదిరెడ్డి దొర, ప్రగడ జోగారావు, 22 గ్రామాలకు చెందిన జనసైనికులు పాల్గొన్నారు.

డైట్ కళాశాలను సందర్శించిన మస్తానయ్య



మస్తానయ్యను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్ ఫిబ్రవరి1: రాష్ట్ర సమగ్ర శిక్షా డైరెక్టర్ వి.మస్తానయ్య రూరల్ మండలం బొమ్మూరులో గల జిల్లా విద్యాశిక్షణ సంస్థను గురువారం సందర్శించారు. విద్యాసంస్థలో చేసడుతున్న వివిధ కార్యక్రమాలను ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రమణను అడిగి తెలుసుకున్నారు. శిక్షణ సంస్థకు సంబంధించి పలు సూచనలు చేశారు. అనంతరం కళాశాల బృందం ఆధ్వర్యంలో మస్తానయ్యను సత్కరించారు.

నరసింహారావు కుటుంబానికి పరామర్శ

కోరుకొండ, ఫిబ్రవరి1: టీడీపీ సీనియర్ నాయకుడు బలరామయ్య చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు నాగా నరసింహారావు ఇటీవల గుండెపోటు మరణించడంతో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు కోరుకొండ మండలం జంబుపట్నంలో గురువారం నాగా నరసింహారావు కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. నరసింహరావు కుటుంబ సభ్యులు కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, వైసీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, యువ నాయకుడు జక్కంపూడి గణేష్ మాజీ జడ్పీటీసీలు తనకాల నాగేశ్వరరావు, మళ్ళ అప్పలనర్సారావు, ఎంపీపీ వుల్లి సూర్యకుమారి, మాజీ ఎంపీపీలు బుద్దా బాపూజీ, బదిరెడ్డి బుజ్జిలు, టీడీపీ నాయకులు మింగి లక్ష్మి నారాయణ, పరస శ్రీను, అడపా వీరబాబు, వైసీపీ నాయకులు ఉన్నారు.

ఎంఏ సైకాలజీలో పట్టభద్రుడైన త్రిమూర్తులు



నన్నయ్య వీసీ పద్మరాజు నుంచి ఎంఏ పట్టా అందుకుంటున్న త్రిమూర్తులు

రంగంపేట, ఫిబ్రవరి 1 : రంగంపేట మండలం ఈలకొలను శివారు అచ్యుతాపురం గ్రామానికి చెందిన నీలపాల త్రిమూర్తులు నన్నయ్య యూనివర్సిటీలో 2020-22 బ్యాచ్ లో ఎంఏ సైకాలజీ పూర్తి చేశారు. బుధవారం నన్నయ్యయూనివర్సిటీలో గవర్నర్ అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవంలో త్రిమూర్తులు వీసీ పద్మరాజు చేతులమీదుగా ఎంఏ పట్టా అందుకున్నారు. త్రిమూర్తులను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి ఆళ్ళ గోవింద్, మండల అధ్యక్షుడు వెలుగుబంటి సత్తిబాబు తదితరులు అభినందించారు.

నన్నయ్య యూనివర్సిటీ ఎంబీఏ టాపర్‌గా భానురేఖ



నన్నయ్య వీసీ నుంచి ఎంబీఏ టాపర్ అవార్డు అందుకుంటున్న భానురేఖ

బిక్కవోలు, ఫిబ్రవరి 1: కొమరిపాలెం గ్రామానికి చెందిన తేతల భానురేఖ రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో ఎంబీఏ టాపర్‌గా నిలచి అవార్డు అందుకున్నారు. నన్నయ్య యూనివర్సిటీలో బుధవారం జరిగిన 13, 14, 15 స్నాతకోత్సవంలో భానురేఖ 2021 సంవత్సరానికిగాను ఏంబీఏలో టాపర్‌గా నిలిచి వీసీ కె. పద్మరాజు నుంచి అవార్డు అందుకున్నారు. ఈసందర్భంగా ఆమెను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బిక్కవోలు ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి, కొమరిపాలెం మాజీ సొసైటీ అధ్యక్షుడు తాడి అరవిందం, కేపీఆర్ సంస్థల డైరెక్టర్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి అభినందించారు.

పేద ప్రజల సంక్షేమమే వైసీపీ ధ్యేయం

రంగంపేట, ఫిబ్రవరి: 1 రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమమే వైసీపీ ధ్యేయమని అందుకే పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామన్నారు. గురువారం రంగంపేట మండలంలో గల వెంటాపురం,సుభద్రంపేట, దొడ్డిగుంట, మర్రిపూడి గ్రామాలలో నిర్వహించిన డ్వాక్రా మహిళలకు అందిస్తున్న రుణమాఫీ నాలుగవ విడత ఆసరా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం డ్వాక్రా యానిమేటర్‌లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పేపకాయల రాంబాబు, జడ్పీకోఆప్షన్ సభ్యుడు లంక చం ద్రన్న, కొల్లాటి ఇశ్రాయేలు, అడబాల వెంకటేశ్వరరావు, మంగిన రాంబాబు, గవరసాని రాజు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వెంకటాపురంలో డ్వాక్రా యానిమేటర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో

హుండీలో సొమ్ము చోరీ

కొవ్వూరు, ఫిబ్రవరి 1 : కొవ్వూరు గోదావరి గట్టుపై సుబ్రహ్మణ్య స్నానఘట్టం వద్ద శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి హుండీలో సొమ్మును దొంగిలించినట్లు కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం ప్రతిరోజు మాదిరిగా గురువారం ఉదయం 6 గంటలకు ఆలయ అర్చకుడు దేవర కొండ సాయిప్రసాద్ ఆలయాన్ని శుభ్రం చేస్తున్నారు. నందీశ్వరుని వద్ద ఉన్న ఆలయ హుండీ కనిపించకపోవడంతో ఆలయమంతా వెతికారు. ఆలయం వెనుకభాగంలో హుండీ తాళాలు బద్దలుకొట్టి, భక్తులు సమర్పించిన సొమ్మును దొంగిలించుకుపోయారు. సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆలయ సీసీ కెమెరా పుటేజ్‌లను పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులు ప్రవేశించి, హుండీ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. దీనిపై పట్టణ హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైతు సమస్యలపై అవగాహన అవసరం

చాగల్లు, ఫిబ్రవరి 1 : విద్యార్థులు రైతు సమస్యలపై అవగాహన పెంచుకోవడం కోసం గ్రామీణ పని అనుభవం కార్యక్రమం దోహదం చేస్తూ ఉద్యాన కళాశాల డీన్ డాక్టర్ మాధవి అన్నారు. నెలటూరు శ్రీసీతారామకళ్యాణ మండపంలో వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వెంకట్రామగూడెం విద్యార్థులు పని అనుభవం ముగింపు కార్యక్రమం జరిగింది. కొవ్వూరు మండలం పశివేదల, చాగల్లు మండలం నెలటూరు, కలవలపల్లి గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు కొత్త పద్ధతుల్లో వ్యవసాయం చేసి రైతులకు మేలు కలిగేలావిద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు.

బిక్కవోలు ఎంపీడీవోగా విజయలక్ష్మి



బిక్కవోలు, ఫిబ్రవరి 1: బిక్కవోలు ఎంపీడీవోగా వి. విజయలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె విశాఖపట్నం జిల్లా అచ్యుతాపురం మండల ఎంపీడీవోగా పని చేస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా బిక్కవోలు వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన జే.అంథోనిరుఫాస్ పశ్చిమగోదావరిజిల్లాకు బదిలీ అయ్యారు.

అనపర్తి ఎంపీడీవోగా రవికుమార్



అనపర్తి : అనపర్తి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా వీవీ రవికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీలలో భాగంగా ఆయన విశాఖ జిల్లా కొంకోట నుంచి బదిలీపై అనపర్తి వచ్చారు. పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది రవికుమార్‌కు స్వాగతం పలికారు.

రాజానగరం ఎంపీడీవోగా జ్యోతిర్మయి

రాజానగరం, ఫిబ్రవరి 1 : రాజానగరం ఎంపీడీవోగా జీఏకేఎస్‌వీ జ్యోతిర్మయి గురువారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ గోదావరిజిల్లా గణపవరం మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీ వోగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.సుబ్రహ్మణ్యం నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా కార్యాలయ ఉద్యోగులు గంగాధర్, వైసీపీ నాయకులు మండారపు వీర్రాజు తదితరులు ఎంపీడీవో జ్యోతిర్మయికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు

కోరుకొండ ఎంపీడీవోగా హేమసుందరరావు

కోరుకొండ, ఫిబ్రవరి1: కోరుకొండ ఎంపీడీవోగా గురువారం వి.హేమసుందరరావు పదవీబాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ ఎంపీడీవోగా పని చేస్తున్న నరేష్‌కుమార్ బదిలీపై పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. 2024 ఎన్నికల్లో భాగంగా ఈ బదిలీలు జరిగాయి. నూతన ఎంపీడీవో హేమసుందరరావును గురువారం పలువురు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల పరిషత్ సిబ్బంది అభినందనలు తెలిపారు. బదిలీపై వెళుతున్న నరేష్‌కుమార్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు.

అనపర్తిలో 15 గ్రాముల బంగారం చోరీ

అనపర్తి, ఫిబ్రవరి 1: అనపర్తిలోని బుల్లియ్యగారి తోటలోని శ్రీనగర్ కాలనీలో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు వేసి ఉన్న ఇంట్లోకి ప్రవేశించి 15గ్రాములు బంగారం, కొంత నగదును దోచుకుపోయారు. ఏఎస్ఐ వీర్రాజు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనగర్ కాలనీలోని ఓ అపార్టుమెంటులో నివాసం ఉంటున్న సత్తి వెంకటరెడ్డి గత నెల 29న ఇంటికి తాళాలు వేసుకుని విజయవాడకు వెళ్ళారు. బుధవారం ఇంటి తలుపులు తెరిచి ఉండట ంతో ప్రక్కింటి వారు వెంకటరెడ్డికి సమాచారం అంది ంచారు. ఆయన వచ్చి చూసేసరికి బీరువా తాళాలు పగులగొట్టి ఉండటంతో గురువారం పోలీసులకు సమా చారం అందించారు. బీరువాలోని రూ.40వేల విలువ చేసే 15 గ్రాముల బంగారం, కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడు వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

• 14,600 నగదు, 4 సెల్‌ఫోన్లు, మోటారుసైకిల్ స్వాధీనం

కడియం, ఫిబ్రవరి 1: కడియపులంక దోసాలమ్మ కాలనీ ప్రాంతంలో ఓ నర్సరీలో పేకాడుతున్న కేంద్రంపై కడి యం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీదాస్, ఎస్ఐ ఎండీ ఆష్పాక్, పోలీసుసిబ్బంది గురువారం దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నామని, మరో ముగ్గురు పారిపోయారని, పట్టుకున్న ముగ్గురు వ్యక్తుల నుంచి రూ. 14,600 నగదు, 4 సెల్‌ఫోన్లు, మోటారుసైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇళ్లపల్లిలో రుణమాఫీ చెక్కుల పంపిణీ

బిక్కవోలు, ఫిబ్రవరి 1: ఇళ్లపల్లిలోని డ్వాక్రా గ్రూపులకు గురువారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి నాల్గవ విడత రుణమాఫీ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లొల్ల భద్రం, రంగంపేట జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, మండల కన్వీనర్ పోతుల ప్రసాదరెడ్డి, వైసీపీ నేతలు సాధనాల రాంబాబు, రొంగల అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రంగంపేట, ఫిబ్రవరి 1 : రంగంపేట మండలం వడిశలేరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో శుక్రవారం మరమ్మతుల నిమి త్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వడిశలేరు, ఎస్టీరాజాపురం, ముకుందవరం, గ్రామాల్లో, విద్యుత్ బోరులకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ డీఈ దాట్ల శ్రీధర్‌వర్మ గురువారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులందరూ విద్యుత్ శాఖ కు సహకరించాలని ఆయన కోరారు.

బీజేపీలో చేరిన 20 మంది మండల నాయకులు

రంగంపేట, ఫిబ్రవరి, 1 : రంగంపేట మండలంలో గల వడిశలేరు, పెదరాయవరం, చంద్రేడు, ఎస్టీరాజాపురం,ముకుందవరం, రంగంపేట గ్రామాలకు చెందిన 20 మంది నాయకులు గురువారం బీజేపీలో చేరారు. రాజమహేంద్రవరం పార్లమెంటరీ ఎన్నికల కార్యాలయం ప్రారంభించిన అనంతరం ఎన్నికల శంఖారావం పూరించి కార్యకర్తలను ఎన్నికలకు సన్నద్ధం చేశారు. తరువాత వీరంతా అనపర్తి నియోజక వర్గ కన్వీనర్ ఎంఎస్‌ఆర్‌కె రాజు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శుక్రవారం 2 ఫిబ్రవరి 2024 | 5



పులి జాడేది!

పులి పాదముద్ర

ఒకటి కాదు రెండా?

పులి కంగారెత్తిస్తోంది.. ఎక్కడ ఉందో ఎలా ఉందో తెలియదు కానీ.. పులి పాదముద్రలను పోలిన పాదముద్రలు కనిపిస్తే చాలు జనం హడలెత్తిపోతున్నారు.. ఎందుకంటే సుమారు 10 రోజులుగా అటు ఏలూరు జిల్లాలోని బుట్టాయగూడెం నుంచి ఇటు తూర్పుగోదావరి జిల్లాలోని నల్లజర్ల అటవీ కేంద్రాల్లో తిరుగుతున్నట్టు వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి.. తాజాగా పులి గోపాలపురం, దేవరపల్లి అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్టు చెబుతున్నారు.. ఈ టెన్షన్ తీరలేదంటే గురువారం తాళ్ళపూడిలో చిరుత సంచరిస్తున్నట్టు ఒక వీడియో బయటకు వచ్చింది.. దీంతో జనం వణికిపోతున్నారు. -7లో

చనిపోయినా ఓటు

- రాజానగరంలో వింత పరిస్థితి
- చక్రద్వారబంధంలో 33 ఓట్లు
- ఓటర్ల తుది జాబితాలో ఇదీ తీరు

రాజానగరం, ఫిబ్రవరి 1 : ఓటర్ల జాబితాలకు తుది మెరుగులు ఎన్ని అద్దినప్పటికీ ఇంకా అనేక లోపాలు వెలుగు చూస్తు న్నాయి. జాబితాల్లో అర్హుల ఓట్లు కనుమరుగై.. అనర్హుల పేర్లు దర్శనమిస్తున్నాయి. అలాగే శాశ్వతంగా గ్రామాంతరం వెళ్లిన వారి పేర్లు, ఒక్కొక్కరికి రెండేసి ఓట్లు (డబుల్ ఎంట్రీ)పేర్లు సైతం కనిపిస్తున్నాయి.ఈ నేపథ్యంలో జాబితాల రూపకల్పనలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు న్నాయి.రాజాన గరం మండలం చక్రద్వారబంధం గ్రామ ఓటర్ల జాబితానే ఇందుకు నిలువెత్తు నిదర్శనం. ఇటీవల జనవరి 22న ప్రభుత్వం విడుదల చేసిన ఓటర్ల తుది జాబితా ప్రకారం గ్రామంలో 170,171,172 పోలింగ్ కేంద్రాల్లో 3,463 మంది ఓటర్లు ఉన్న ట్టుగా ఆయా గ్రామ సచివాల యాలకు జాబి తాలు విడుదల య్యాయి. అయితే వీటిలో 170వ పోలింగ్ కేంద్రంలో జాబితాల్లో ఏకంగా 33 మంది మృతులకు ఓటు హక్కు కల్పించిన పేర్లు దర్శనమిచ్చాయి. గ్రామానికి చెందిన పిల్లా నాగేశ్వరరావు, పితాని రామ స్వామి, భూషంశెట్టి సీతారత్నం, సుంకర చక్రం, చిక్కాల సూర్యారావు, వనుం సూరమ్మ, ఏగి సూర్యారావు తది తరులు గత కొన్నేళ్ల కిందట మర ణించారు. మృతుల పేర్లు సైతం జాబితాల్లో పొందుపర్చి మృతులకు ఓటు హక్కు కల్పించడంపై గ్రామస్తులు ఆశ్చర్యానికి లోనయ్యారు. దీంతో జాబితాల్లో లోపాలను ఆలస్యంగా గుర్తించిన బూత్ ఇన్‌చార్జ్ మాదబోయిన శ్రీను, యూనిట్ ఇన్‌చార్జ్ షోడసాని త్రిమూ ర్తులు ఓటర్ల జాబితాల్లో చేసుకున్న లోపాలను సవరించాలని కోరుతూ స్థానిక బీఎల్‌వోకు వినతి పత్రాలు అందజేశారు. రాష్ట్ర ఎన్నికల అధికారులు సవరణ షెడ్యూల్ ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికి తమకేమీ పట్టనట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు.రాజానగరం నియోజకవ ర్గంలో 216 పోలింగ్ కేంద్రాల్లో 2,13,911 మంది ఓటర్లు ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 1,05,824 మంది, మహిళలు 1,08,083 మంది, థర్డ్ జెండర్ 4 ఉన్నట్లుగా ప్రచురించి తుది జాబితాను విడుదల చేశారు. అయితే ఒక్క చక్రద్వార బంధం లోనే ఇన్ని లోపాలు వెలుగు చూస్తే నియోజకవర్గం మొత్తంగా ఎన్ని లోపాలు,అవకతవ కలు చోటు చేసుకుంటాయోనని తెలు గు తమ్ముళ్లు ఆందోళన చెందుతు న్నారు. జాబితాల్లో చోటు చేసుకున్న లోపాలను సవరించాలని కోరుతూ గ్రామంలోని బీఎల్‌వో మల్లికకు యూనిట్ ఇన్‌చార్జ్ త్రిమూర్తులు వినతి పత్రం అందజేశారు.



మధ్యంతర గేలం!



పార్లమెంట్ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ కేంద్ర ప్రభుత్వ మధ్యంతర బడ్జెట్ మధ్యతరగతి, పేదలపై దృష్టి పెట్టింది. సామాన్యుల ఓట్లను ఆకర్షించడమే లక్ష్యంగా అడుగులు వేసింది. సొంతింటి కలను నెరవేర్చుకోవాలనే బడుగు జీవుల ఆశలపై ఓట్ల వల విసిరింది. రైతులు, మహిళలకు పెద్దగా ఖర్చులేని వరాలు ప్రకటించి ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. విద్యుత్ బిల్లుల భారంతో చితికిపోతున్న పేదలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేలా రూఫ్‌టాప్ సోలారైజేషన్ స్కీం ప్రకటించి వారికి దగ్గరయ్యే ప్రయత్నం చేసింది. పన్నుల విధానంలో ఏమార్పు చేపట్టకుండా వేతనజీవిని ఉసూరుమనిపించింది. కొత్త విధానంలో రూ.7 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉండగా, దాన్ని రూ.8 లక్షలకు పెంచుతారని ప్రచారం జరిగినా కరుణించలేదు. అటు పీఎం కిసాన్ సాయాన్ని రూ.8 వేలకు పెంచుతారని లీకులిచ్చినా బడ్జెట్‌లో ఆ ఊసే లేదు. వెరసి పలురకాల ఆకర్షణలతో ఓట్లను రాబట్టుకోవడమే లక్ష్యంగా నిర్మలమ్మ పద్దు మమ అనిపించింది.

వేతనజీవికి రిక్తహస్తం..

ఏటా కేంద్ర బడ్జెట్‌లో వేతన జీవులకు ఎంతోకొంత ఊరట ఉంటుందని భావించడం, చివరకు భంగపాటుకు గురవడం షరా మామూలుగా మారింది. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓట్ల ఆకర్షణే ధ్యేయంగా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు ఎంతోకొంత ఆదాయపు పన్ను తగ్గింపును కేంద్రం ప్రకటిస్తుందని అంతా భావించారు. ఈ మేరకు లీకులు కూడా వెలువడ్డాయి. కానీ ఎప్పటిలాగే నిర్మలమ్మ బడ్జెట్ వేతన జీవులకు ఊరట కల్పించలేదు. ఒకరకంగా చెప్పాలంటే ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన ఈ తాత్కాలిక బడ్జెట్‌లో పన్ను విధానాల్లో ఎలాంటి మార్పుల జోలికి వెళ్లలేదు. కొత్త విధానంలో ఉన్న పన్నుదారులకు రూ.7 లక్షల వరకు ఎలాంటి పన్ను ఉండదని మాత్రం చెప్పారు. వాస్తవానికి దీన్ని ఈ మధ్యంతర బడ్జెట్‌లో రూ.8 లక్షలకు పెంచుతారని భావించినా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. దీంతో వీరందరికీ నిరాశే మిగిలింది. వాస్తవానికి జిల్లాలో సచివాలయ ఉద్యోగులతో కలిపి మొత్తం 23 వేల మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో వార్షిక ఆదాయం రూ.7 లక్షలు, ఆపై కొంచెం దాటిన వారు సగం మంది వరకు ఉన్నారు. కేంద్రం గనుక ఈ పరిమితిని రూ.8 లక్షల వరకు పెంచి ఉంటే వీరందరికి భారీ ఊరట లభించేది. కానీ నిర్మలమ్మ పద్దు వీరందరినీ ఉసూరుమని పించింది. స్లాబ్‌ల విధానాన్ని మాత్రం కుదించారు.

కాకినాడ (ఆంధ్రజ్యోతి)/ రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఓట్ల ఆకర్షణే లక్ష్యంగా సాగిన తాత్కాలిక బడ్జెట్‌లో మధ్యతరగతికి కేంద్రం తీపికబురు అందించింది. వీరికి ఇళ్ల కొనుగోలు, సొంతింటి నిర్మాణం కోసం కొత్త హౌసింగ్ స్కీం ప్రకటించింది. బస్తీలతో పాటు అద్దె ఇళ్లల్లో ఉన్న వారికి సొంతింటి కల నిజం చేస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో సొంతింటి కల తీరబోతుందనే ఆశ పేద, మధ్యతరగతి వర్గాల్లో పెరిగింది. అయితే ఈ పథకం కింద బ్యాంకు లోన్లకు సంబంధించి రాయితీలను కేంద్రం అందించ నుంది. ఈ పథకానికి సంబంధించి మార్గదర్శకాలు విడుదలైతే ఎవరు అర్హులవు తారనేదానిపై మరింత స్పష్టత రానుంది. అయితే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రాలైన కాకినాడ,అమలాపురం, రాజమహేంద్రవరంతో పాటు పలు మునిసి పాలిటీల పరిధిలోని పట్టణాల్లో వేలాది మంది సొంతిళ్లు లేక అద్దె ఇళ్లల్లో నివసిస్తున్నారు. కేంద్రం ప్రకటించిన ఈ పథకంతో వారికి మరింత లబ్ధి కలగనుంది. మరో పక్క రాబోయే ఐదేళ్లలో పీఎం ఆవాస్ యోజన కింద రెండు కోట్ల ఇళ్లు కట్టిస్తామని కేంద్రం ప్రకటించింది. దీంతో జిల్లా లో భారీగా లబ్ధిదారులు పెరగను న్నారు. విద్యుత్ బిల్లుల నుంచి సామాన్యులకు విముక్తి కలిగించేలా బడ్జెట్‌లో కేంద్రం నూతన పథకం ప్రకటించింది. నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేలా రూఫ్ టాప్ సోలారైజేషన్ పథకాన్ని ప్రవేశ పెట్టనుంది. దీని వల్ల గృహ వినియోగదారులకు ఏటా రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు ఆదా అవుతుందని ప్రకటించిం ది. కొత్త పథకం కింద వేలాది మంది లబ్ధిపొందనున్నారు. పాడి రైతులకు సంబంధించి పశువుల్లో పాల దిగుబడి పెం చడానికి కొత్త పథకాన్ని కేంద్రం ప్రకటించింది. పాల దిగుబడి మరింత పెరిగే అవకాశం ఉంది. మరోపక్క ఆక్వా దిగుబడిని హెక్టారుకు మూడు టన్నుల నుంచి ఐదు టన్నులకు పెంచేవిధంగా చర్యలు చేపడ తామని కేంద్రం ప్రకటించింది. అంగన్‌వాడీ కేంద్రా లను ఆధునికీకరిస్తామని బడ్జెట్‌లో ప్రక టించడం కొత్త ఆశలు రేపుతోంది. జిల్లాలో 1547 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. చాలా భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో తాజా బడ్జెట్ ద్వారా వీటికి మంచిరోజులు రానున్నాయి. అన్నదాతలు ఏటా పీఎం కిసాన్ కింద ఆర్థిక సాయం పొందుతున్నారు. వీరికి ఇస్తోన్న రూ.6 వేల సాయాన్ని పెంచుతారని ప్రచారం జరిగినా మొండిచేయే మిగిలింది.

పర్యాటకంపై ఆశలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంటేనే పర్యాటక రంగానికి ప్రసిద్ధి. అటు ఆధ్యాత్మిక టూరిజం, ఇటు రివర్, ఎకో టూరిజం, ఇంకోవైపు బీచ్ టూరి జంపరంగా అద్భుతమైన పర్యాటక కేంద్రాలు ఉన్నాయి. అయితే అభివృద్ధి మాత్రం అంతగా లేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వీటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. కేంద్రం కొత్త బడ్జెట్‌లో పర్యాటక రంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపింది. పర్యాటక రంగ అభివృద్ధి, అక్కడ అందే సేవల ఆధారంగా ఈ పర్యాటక కేంద్రాలకు రేటింగ్ ఇవ్వాలని నిర్ణయించింది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వాలతో కలసి దామాషా పద్ధతిన ఆ కేంద్రాల అభివృద్ధికి వడ్డీ రహిత రుణాలందించాలని భావిస్తున్నట్టు బడ్జెట్‌లో ఉదహరించారు.ఇదే అమల్లోకి తెస్తే కోట్లాది రూపాయలు ఆయా పర్యాటక ప్రాజె క్టుల కోసం ఖర్చు చేసే అవకాశం ఉంది. కచ్చితంగా ఏపీకి వచ్చేసరికి ఉమ్మడి తూర్పు గోదావరికి ప్రయోజనం చేకూరుతుందని జిల్లావాసులు భావిస్తున్నారు.

'పోలవరం' మాటేమిటి?

కేంద్ర బడ్జెట్‌లో ఈసారి కూడా పోలవ రానికి ప్రత్యేక నిధులు కేటాయిం చిన దాఖలాలు ఇప్పటివరకు లేవు. ఆర్అండ్ ఆర్ పూర్తి స్థాయిలో అమలుచేయడం గాని, ప్రాజెక్టును పూర్తి చేయడానికి గాని కేంద్రం ఇచ్చే నిధులే ప్రధాన ఆధారం. ఇది మధ్యంతర బడ్జెట్ అయినప్పటికీ ఈ ప్రాజెక్టుకు ఎన్నికల నేపథ్యంలోనైనా న్యాయం జరుగుతుందని రైతులు ఆశిం చారు. ఆ దిశగా నిధుల కేటాయింపు జరిగినట్టు లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

- మధ్యతరగతి జీవులపై కేంద్ర బడ్జెట్ ఆశల వల
- అద్దె ఇళ్లల్లో నివసిస్తున్న వారి సొంతింటికో పథకం
- విద్యుత్ బిల్లుల విముక్తికి రూఫ్‌టాప్ సోలారైజేషన్ స్కీం
- వేతనజీవికి పూర్తిగా నిరాశే
- తాత్కాలిక పద్దులో కానరాని ఆదాయపు పన్ను మార్పులు
- పీఎం కిసాన్ సాయం పెంపు మాటేలేదు
- పర్యాటక రంగం అభివృద్ధి వడ్డీ రహిత రుణాలు
- అంగన్‌వాడీ కేంద్రాల ఆధునికీకరణ
- పోలవరం మాటేమరిచారు?

ఇది పూర్తిగా ఎన్నికల బడ్జెట్



బడ్జెట్ పూర్తిగా ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రజల దృష్టిని మరల్చేలా ఉంది. ఎరువుల ధరలు తగ్గిస్తా మని రైతులకు మాట ఇచ్చి బడ్జెట్‌లో అంశాన్ని చేర్చలేదు. పీఎం కిసాన్ సాయాన్ని రూ. 9వేలకు పెంచుతా రని అంచనా వేసినా ఆ దిశగా ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం .

- గన్నికృష్ణ ,టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఆంధ్రాకు గుండుసున్నా



బడ్జెట్‌లో ఆంధ్రాకు ఒరిగిందేమీలేదు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కేవలం బడ్జెట్ పేరుతో చేసిన ఎన్నికల ప్రసంగమే. ఇలాంటి చెత్త బడ్జెట్ ఏనాడూ చూడలేదు. వచ్చే ఐదేళ్ళ భారత్ అద్భుతమైన ప్రగతి సాధించ బోతుందని చెప్పుకోవడం ఎన్నికల ర్యాలీల్లో చేసిన ప్రసంగంలా ఉంది.

- మధు, సీపీఐ జిల్లా కార్యదర్శి

బిరియానీ ధర కోసం ఘర్షణ..
ఒకరిపై ముగ్గురు దాడి

గోకవరం, ఫిబ్రవరి 1 : బిరియానీ ధర విషయమై జరిగిన ఘర్షణ ఒకరిపై హత్యాయత్నానికి దారితీసింది. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ లో గురువారం నార్త్‌జోన్ ఇన్‌చార్జ్ డీఎస్పీ కిషోర్‌కుమార్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడిం చారు. పోలీస్ స్టేషన్ ప్రక్కన గల లక్ష్మీ కళ్యాణ ఫ్యామిలీ రెస్టారెంట్ వద్దకు గోకవరం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు బిరియానీ కోసం వెళ్లడం జరిగిందన్నారు. ఆ సమయంలో బిరియానీ ధర విషయంలో రెస్టారెంట్‌లో పనిచేస్తున్న ములపర్తి రాజుకు ఆ ముగ్గురు వ్యక్తుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుందని తెలిపారు.ఆ ముగ్గురు వ్యక్తులు పక్కనే ఉన్న డ్రింక్ బాటిల్‌ని పగలగొట్టి రాజు వీపు పైన రెండుసార్లు, ఎడమ చేతిపై ఒకసారి కొట్టడం జరిగిందన్నారు.దీంతో రాజు గాయపడగా ప్రభుత్వాసుపత్రిలో చికి త్స పొందుతున్నాడని చెప్పారు.రెస్టారెంట్‌లో బుధవారం దాడి సంఘ టన బ్లేడ్ బ్యాచ్ పని కానే కాదని తెలిపారు.బాధితుడు రాజు ఫిర్యాదు మేరకు గోకవరానికి చెందిన రొంగలి ఈశ్వర వీర గణేష్, పోసిన వీరభా ర్గవ్,తోట దీపకపై కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బస్, ఎటువంటి పత్రాలు లేని నగదు

రూ.9,91,820ల నగదు సీజ్

సరైన పత్రాలు లేకుండా బస్‌లో తరలిస్తుండగా పట్టివేత

కొవ్వూరు,ఫిబ్రవరి 1 : సరైనపత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.9,91,820ల నగదు, 17 గ్రాముల బంగారు వస్తువులను కొవ్వూరు పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.కొవ్వూరు గామన్‌బ్రిడ్జి టోల్ గేట్ వద్ద బుధవారం రాత్రి కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు సిబ్బ ందితో వాహన తనిఖీలు చేపట్టారు.పలాస నుంచి శ్రీకాకుళం వెళుతున్న ప్రతాప్ ట్రావెల్స్ ప్రైవేటు బస్సు డ్రైవర్ బాల దివాకర్‌కు శ్రీకాకుళంలో ఒక వ్యక్తి 17 గ్రాముల బంగారు చైను, రూ. 6,41,820లు నగదు,మరొక వ్యక్తి రూ. 3,50,000ల నగదును వేర్వేరుగా పార్శిల్ చేసి విజయవాడలో ఇమ్మన్నారు. నగదుకు సంబంధించి పత్రాలు చూపించకపోవడంతో నగదు, బంగారు గొలు సు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని బస్సు సీజ్‌చేసి కొవ్వూరు పోలీస్టేషన్‌కు తరలించారు.డ్రైవర్ బాల దివాకర్ ను తహశీల్దార్ కోర్టులో హాజరుపర్చనున్నట్టు సీఐ జగదీశ్వరరావు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

'తోట' తీరు బాగోలేదు

- ఆయన వల్లే నాయకులు వైసీపీని వీడుతున్నారు
- భవిష్యత్తులో జగ్గంపేట నియోజకవర్గంలో వైసీపీ ఖాళీ
- గోకవరం జడ్పీటీసీ దాసరి శ్రీరంగ, వైసీపీ నాయకులు

గోకవరం, ఫిబ్రవరి1: జగ్గంపేట వైసీపీ ఇన్‌చార్జ్, మాజీమంత్రి తోట నరసింహం నాయకులతోను, కార్యకర్తలతోను వ్యవహరిస్తున్న తీరువల్ల నియోజకవర్గంలో పార్టీ తీవ్రంగా నష్టపోతుందని గోకవరం జడ్పీటీసీ దాసరి శ్రీరంగ, ఆమె భర్త వైసీపీ సీనియర్ నాయకుడు దాసరి రమేష్ ఆరోపించారు. గోకవరంలోని వైసీపీ కార్యాలయం వద్ద గురువారం పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.జడ్పీటీసీ శ్రీరంగ, రమేష్ మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా తోట నరసింహం నియామకం జరిగాక పార్టీలోని సీనియర్ నాయకులను, కార్యకర్తలను సంప్రదించ కుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన చెందారు. దీంతో చాలా మంది సీనియర్ నాయకులు పార్టీని వీడుతున్నారన్నారు. భవిష్యత్తులో కూడా ఆయన ఇదే వైఖరిని ప్రదర్శిస్తే నియో జకవర్గంలో వైసీపీ ఖాళీ అయిపోయే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా తాను కూడా వైసీపీని వీడతానన్నారు. సమావేసంలో వైసీపీ నాయకులు దాసరి రమేష్, ఆకుల సుబ్రహ్మణ్యం, అప్పారావు కాపు, ఉయ్యూరు నాని, కంచి లక్ష్మణదొర, దోమల గంగాధర్, జాస్తి వసంత్ తదితరులు పాల్గొన్నారు.

శిరోముండనం కేసులో చారిత్రాత్మక తీర్పు

- క్వాష్ పిటీషన్ కొట్టివేసి విచారణకు ఆదేశాలు?
- సోషల్ మీడియాలో హల్‌చల్

సీతానగరం,ఫిబ్రవరి 1 : సీతానగరంలో నాలుగేళ్ల కిందట జరిగిన దళిత యువకుడి శిరోముండనం కేసులో చారిత్రాత్మక తీర్పు వెలువడి నట్టు సమాచారం. క్వాష్ పిటిషన్ కొట్టివేసినట్టు సోషల్ మీడియాలో కథనాలు నడుస్తున్నాయి.సీతానగరం మండలం మునికూడలి గ్రామానికి చెందిన దళిత యువకుడు వరప్రసాద్ ఇసుక అక్రమ రవాణా అడ్డుకుం టున్నాడన్న నెపంతో వైసీపీ నాయకులు పోలీస్ స్టేషన్‌లో శిరోముండనం చేయించారు.ఈ కేసుపై తదుపరి విచారణ జరగకుండా నిందితులు స్టే ఉత్తర్వులు పొందారు. దీనిపై సుదీర్ఘవిచారణ అనంతరం క్వాష్ పిటిషన్ కొట్టివేస్తూ విచారణ కొనసాగించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసినట్టు సోషల్‌మీడియాలో హల్‌చల్ అవుతోంది.దీనిపై సీతానగరం ఎస్ఐ రామ కృష్ణను వివరణ కోరగా తాను కూడా సోషల్‌మీడియాలోనే చూశానని.. అధికారిక ఉత్తర్వులు ఇంకా అందలేదన్నారు. - వివరాలు 9లో

జిల్లాలో టెన్త్ ,ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 1: జిల్లాలో వచ్చే నెలలో జరిగే టెన్త్ ,ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత తెలిపారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ప్రగతిని వివరించారు. టెన్త్ , ఇంటర్ పరీక్షలపై వివరాలు వెల్లడించారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలకు సంబంధించి 137 పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. మొత్తం 23,681 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా వారిలో బాలలు 12,112, బాలికలు 11,516 మంది ఉన్నారని తెలిపారు. వీరిలో ఆంగ్ల మాధ్యమంలో 17,267 మంది, తెలుగు మాధ్యమంలో 6,414 మంది హాజరవుతారని తెలిపారు. గత ఏడాది 72 శాతం ఉత్తీర్ణత సాధించారని ఈ ఏడాది నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇంటర్ పరీక్షలకు సంబంధించి జిల్లాలో 52 పరీక్ష కేంద్రాల ద్వారా 41,304 మంది హాజరుకానున్నారని వారిలో మొదటి ఏడాది 21,288 మంది ద్వితీయ సంవత్సరం 20,016 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఇంటర్మీడియెట్‌కి 37,502 మంది, ఒకేషనల్ కోర్సు విద్యార్థులు 3802 మంది ఉన్నారని తెలిపారు. జిల్లాలో రిజిస్ట్రేషన్ కోసం జిల్లాలో 57,918 ప్లాట్స్ మ్యాపింగ్ పూర్తి చేశామని, సుమారు 55 వేల ప్లాట్స్‌కు సరిహద్దులు గుర్తించినట్టు తెలిపారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ, ఉపాధి హామీ, జగనన్న ఆరోగ్య సురక్షల ప్రగతిపై వివరాలు వీడియో కాన్ఫరెన్స్‌లో వివరించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, సీపీవో ఎల్ అప్పలకొండ, డ్వామా పీడీ ఏ.ముఖలింగం, డీఎంహెచ్‌వో డాక్టర్ కే.వెంకటేశ్వరరావు, డాక్టర్ సూర్యప్రభ, డాక్టర్ ఎన్.సనత్ కుమారి, డాక్టర్ పి.ప్రియాంక, డీపీవో జీవీసత్యనారాయణ పాల్గొన్నారు.



పనిచేయాలంటే.. ఏడుపే!

సివిల్ సప్లయిస్‌లో ఏమి జరుగుతోంది..

- శాఖలో వింత పరిస్థితి
- రెండేళ్లలో ఏడో మేనేజర్
- కొత్త డీఎంగా టి.రాధిక
- నాయకుల పెత్తనమే కారణం
- తట్టుకోలేకపోతున్న అధికారులు
- వచ్చిన వెంటనే వెళ్లిపోతున్న వైనం
- పట్టించుకోని ఉన్నతాధికారులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్‌గా ఎవరూ పట్టుమని కొద్ది నెలలు కూడా పనిచేయలేకపోతున్నారు. జిల్లాల విభజన జరిగి ఇంకా రెండేళ్లు పూర్తి కాలేదు.. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్‌గా ఏకంగా ఏడో అధికారి నియమితులయ్యారు.ఈ నేపథ్యంలో సివిల్ సప్లయిస్‌లో ఎందుకిలా జరుగుతుందనేది చర్చనీయాంశమైంది. గత ప్రభుత్వాల్లో సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్లు చాలా కాలం పనిచేసేవారు. కానీ జిల్లాల విభజన తర్వాత తూర్పుగోదావరి జిల్లాలో విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటి వరకూ ఆరుగురు డీఎంలు పనిచేయగా ప్రస్తుతం ఏడో మేనేజర్ నియమితులయ్యారు. వైసీపీ ప్రభుత్వంలో అధికారుల కంటే మిల్లర్లు,వాటిని వెనుక ఉండి నడిపించే నేతలదే ఎక్కువ పెత్తనం. జిల్లాలో 5 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం పండుతుంటే కేవలం 2.7 లక్షల టన్నుల వరకూ మాత్రమే వైసీపీ ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా సేకరిస్తోంది. రైతుల నుంచి ధాన్యం సేకరించి కస్టమ్ మిల్లింగ్ రైసు కోసం మిల్లర్లకు ఇవ్వడం,వారి నుంచి 100 కేజీల (క్వింటా) ధాన్యానికి 67 కేజీల బియ్యం తీసుకోవాలి. ఇలా ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యం ఇచ్చినందుకు మొత్తం క్వింటాకు రూ.154 సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చెల్లిస్తుంది. ఇందులో మొత్తం ఏడు రకాల చార్జీలు ఉంటాయి.ఈ బియ్యాన్ని రేషన్ షాపులకు పంపిస్తారు. ఉభయగోదావరి జిల్లాల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బియ్యం పంపిస్తారు. ఇక్కడ పండిన కామన్ రకం ధాన్యం తీసుకుని కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)ను ఇవ్వాలి.దీని కోసం మిల్లుల కెపాసిటీ గుర్తించడం, గంటలకు ఎంత బియ్యం ఆడ గలవనే వివరాలు సేకరించి, వాటి కెపాసిటీ బట్టి ధాన్యం కేటాయించాలి. వారికి ధాన్యం కేటాయించే ముందు, వాటి విలువకు సరిపోయే బ్యాంక్ గ్యారంటీ కట్టించుకోవాలి. కానీ కొంత మంది మిల్లర్లు కెపాసిటీ లేకపోయినా, రాజకీయనేతలు, ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి సీఎంఆర్ అనుమతి పొందేస్తారు. ధాన్యం తీసుకున్న తర్వాత సుమారు 3 నెలల గడువు ఉంటుంది. ఈలోపు బియ్యం ఇచ్చేయాలి. కానీ కొందరు సకాలంలో ఇవ్వరు. ధాన్యాన్ని బయట అమ్మేసుకుంటారు.వేరే నాసిరకం ధాన్యం ఇతర ప్రాంతాల్లో తక్కువ ధరకు కొని తిరిగి సీఎంఆర్‌గా ఇస్తుంటారనే ఆరోపణ ఉంది. అంతేకాక ధాన్యాన్ని ఎక్కువ ధరకు బయటమార్కెట్‌లో అమ్మేసుకోవడమో లేక బియ్యాన్ని అమ్మేసుకోవడమో చేస్తుంటారు.ధాన్యాన్ని అమ్మేసుకుంటే మిల్లింగ్ చార్జీలు, ఇతర చార్జీలు మిగులే. బియ్యం అమ్ముకుంటే పెద్దఎత్తున లాభాలు వస్తాయి. దీని వల్ల రకరకాల మోసాలు చేస్తుంటారనే ప్రచారం ఉంది.ఈ పరిస్థితుల్లో ఇక్కడ అవినీతి అధికంగా ఉంటుంది. ప్రస్తుత ప్రభుత్వంలో మిల్లర్లు అందరూ ఓ వైసీపీ నేత చెప్పినట్టే చేయాల్సి వస్తుంది. అధికారులు కూడా వారు చెప్పినట్టే వినాలి. వాళ్లు తప్పు చేయ మంటే చేయాలి. ఎంత ఇబ్బంది ఉన్నా పనిచేయాలి. లేకపోతే బదిలీ అయి వెళ్లిపోవడమే.ఈ నేపథ్యంలో వీరి మీద తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. పైగా ఏమాత్రం పైవారు చెప్పినట్టు చేయకపోతే అంతే సంగతులు. అందుకేనేమో ఇక్కడ ఎవరూ ఎక్కువ కాలం పనిచేయలేకపోతున్నారు. 2022 ఏప్రిల్ నుంచి కొత్త జిల్లా అమలులోకి వచ్చిన సంగతి తెలిసిందే. అపుడు జిల్లా సివిల్ సప్లయిజ్ మేనేజర్ తులసి చేరారు. ఆమె కేవలం మూడు నెలలు పనిచేశారు. ఆమెను బదిలీ చేసి, అంబేడ్కర్ కోనసీమ జిల్లా మేనేజర్ తనూజను ఇక్కడకు బదిలీ చేశారు.ఆమె కొద్ది నెలలు ఎక్కువే పనిచేశారు. కానీ సమస్య ఇక్కడ వచ్చిందో కానీ ఆమె ఆకస్మికంగా సెలవు పెట్టేయడంతో పాటు,ఉద్యోగానికే రాజీనామా చేసి వెళ్లిపోవడం గమనార్హం. తర్వాత కుమార్ అనే అధికారి చేరి కొద్దిరోజులకే వెళ్లిపోయారు.తర్వాత నాగార్జునరెడ్డి అనే అధికారి జాయినయ్యారు. కేవలం కొద్ది రోజులే పనిచేసి వెళ్లిపోయారు. మళ్లీ కుమార్ అనే మేనేజర్‌గా వచ్చి, మళ్లీ కొద్దిరోజులు పనిచేశారు. కారణాలేంటోకానీ జిల్లా కలెక్టర్ ఆయనకు షోకాజు నోటీసులు ఇచ్చి, తర్వాత కొద్దిరోజుల కిందట ప్రభుత్వానికి సరెండర్ చేశారు. తర్వాత ప్రస్తుత డీఎస్‌వోను ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన ఇంకా కొనసాగుతున్నారు.ఈలోపు ఎన్నికల నేపథ్యంలో సాధారణ బదిలీల్లో భాగంగా తాళ్లపూడి తహశీల్దార్ టి.రాధికను ఇక్కడ జిల్లా మేనేజర్‌గా నియమించారు. ఆమె ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఈ రబీ సీజన్‌లో రెండు మూడు రోజుల్లో ఆమె బాధ్యతలు తీసుకోనున్నారు.ఆమె ఇప్పటి ఏడాది 10 నెలలో ఏడో మేనేజర్ బాధ్యతలు స్వీకరిస్తున్నట్టు అయింది. ఆమె ఎన్ని రోజులు పనిచేస్తారో చూడాలి మరి.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



నిడదవోలులో తహసీల్దార్ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్

నిడదవోలు, ఫిబ్రవరి 1: వైసీపీ ప్రభుత్వం గడిచిన నాలుగున్నరేళ్లుగా భవన నిర్మాణ కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను పొందకుండా జీవో విడుదల చేయడం దారుణమని తక్షణం ఆ జీవోను రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ అన్నారు. గురువారం నిడదవోలు పట్టణం లోని తహసీల్దార్ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లయిమ్‌లు తక్షణం విడుదల చేయాలని అన్నారు. క్లయిమ్‌ల విడుదల చేయకపోవడంవలన నిర్మాణ కార్మికుల ప్రసూతి, మరణాలు, వివాహం, వైద్యం వంటి ఆర్థిక ప్రయోజనాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నం మూర్తి, కండవల్లి దుర్గారావు, పాటంశెట్టి రాజేష్, దిడ్ల నరేష్, క్రొవ్విడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలి'



ఉండ్రాజవరంలో ఎస్టీయూ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ యల్లారీశ్వరి

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 1: విద్యార్థుల ఉన్నతకి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి తెలిపారు. గురువారం ఉండ్రాజవరంలో ఎంపీపీ యల్లారీశ్వరి రాష్ట్రోపాధ్యాయ సంఘ(ఎస్టీయు) డైరీ, క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ యల్లారీశ్వరి మాట్లాడుతూ ఉపాధ్యాయులు మండలంలో విద్యాభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు పి. నిరీక్షణరాజు, ప్రధాన కార్యదర్శి ఎల్ఎన్‌వీబీఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి వై. కాశీవిశ్వనాధం, అసోసియేట్ అధ్యక్షురాలు పి.రమాదేవి, జిల్లా అదనపు మహిళా కార్యదర్శి రమణి, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్‌డీఎస్ శ్రీనివాస్, అదనపు ప్రధానకార్యదర్శి టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి అందరూ సహకరించాలి

● మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి



సీసీ రోడ్ పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి

కొవ్వూరు, ఫిబ్రవరి 1 : పట్టణాభివృద్ధికి అందరూ కలిసికట్టుగా సహకరించాలని కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. గురువారం కొవ్వూరు పట్టణంలోని 22వ వార్డు అనంగపాల్ వీధి ప్రారంభం నుంచి పోతురాజు దిబ్బ జంక్షన్ వరకు రూ.8 లక్షల సాధారణ నిధులతో 147 మీటర్లు సీసీ రోడ్, ఔరంగాబాద్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి సచివాలయం జంక్షన్ వరకు మున్సిపల్ సాధారణ నిధులతో 140 మీటర్లు రూ. 15లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్, రోడ్‌కు ఇరుప్రక్కలా డ్రైనేజీ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ బావనరత్నకుమారి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. చైర్‌పర్సన్ రత్నకుమారి మాట్లాడుతూ పట్టణంలో చేపట్టిన రోడ్లు, డ్రైన్లు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్‌లు కంటమణి రమేష్‌బాబు, కండెల్లి రామారావు, నాయకులు మెరిపో వీర్రాజు, మోహనరావు, తలపాకుల నాగేశ్వరరావు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

చీపురుగూడెంలో డ్రైనేజీకి నిధులు మంజూరు



చీపురుగూడెంలో డ్రైనేజీ నిర్మాణం కోసం అంచనా వేస్తున్న అధికారి వెంకట్

నల్లజర్ల, ఫిబ్రవరి 1 : నల్లజర్ల మండలం చీపురుగూడెంలో డ్రైనేజీ నిర్మాణం చేసేందుకు మంత్రి తానేటి వనిత రూ.20లక్షలు మంజూరు చేసినట్లు సర్పంచ్ గాలింకి మల్లిక, వైసీపీ అధ్యక్షులు చెల్లు హరిబాబు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఇంజనీరింగ్ అసిస్టెంట్ వెంకట్ గురువారం డ్రైనేజీ నిర్మాణం కోసం కొలతలు వేశారు. చీపురుగూడెం ప్రధాన రహదారిపై మరో 80మీటర్లు సీసీ రోడ్డును పెంచుతున్నట్లు పేర్కొన్నారు. తలంశెట్టి మాధవరావు,గాలింకి రాంబాబు, తలంశెట్టి సోమేశ్వరరావు పాల్గొన్నారు

డైట్ కళాశాలను సందర్శించిన మస్తానయ్య



మస్తానయ్యను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్ ఫిబ్రవరి1: రాష్ట్ర సమగ్ర శిక్షా డైరెక్టర్ వి.మస్తానయ్య రూరల్ మండలం బొమ్మూరులో గల జిల్లా విద్యాశిక్షణ సంస్థను గురువారం సందర్శించారు. విద్యాసంస్థలో చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రమణను అడిగి తెలుసుకున్నారు. శిక్షణ సంస్థకు సంబంధించి పలు సూచనలు చేశారు. అనంతరం కళాశాల బృందం ఆధ్వర్యంలో మస్తానయ్యను సత్కరించారు.



నిడదవోలులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు



ఉండ్రాజవరం: సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ



చాగల్లు నుంచి కొవ్వూరు టీడీపీ సమావేశానికి తరలి వెళుతున్న టీడీపీ నాయకులు

బీజేపీ కార్యాలయం ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 1: రాజమహేంద్రవరంలో గురువారం బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయాన్ని రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. రాష్ట్రంలో 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల కార్యాలయాలు ఏర్పాటు చేసినట్టు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లల మర్రి మురళీకృష్ణ తెలిపారు. ఈ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రేలంగి శ్రీదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరిమి రాధాకృష్ణ, జాస్తి మూర్తి, అడబాల రామకృష్ణ, కొల్లివలస హారిక, ధార్మిక సెల్ రాష్ట్ర కన్వీనర్ సత్యగోపీనాథ్ దాస్, రొంగల గోపి శ్రీనివాస్, కురగంటి సతీష్, కాలెపు సత్యసాయిరామ్‌పాల్గొన్నారు.

టీడీపీ కార్యక్రమాలను విజయవంతం చేయాలి

నిడదవోలు, ఫిబ్రవరం 1: తెలుగుదేశం పార్టీ ఆదేశించిన ఓటరు లిస్ట్ వెరిఫికేషన్ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలను క్లస్టర్ యూనిట్ బూత్ స్థాయిలో పక్కాగా చేయాలని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. గురువారం నిడదవోలు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ క్లస్టర్ యూనిట్ బూత్‌స్థాయిలో నాయకులకు ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ ఇచ్చిన ఉప్పులూరి జానకి రామయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్ చేయడం ద్వారా పార్టీకి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు తన్నీడి బోసు, ఆకుతోట సతీష్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

● మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు

బూత్‌స్థాయి నాయకులు కష్టపడి పనిచేయాలి

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 1: బూత్‌స్థాయి నాయకులు కష్టపడి పనిచేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం వేలివెన్ను గ్రామంలో ఉండ్రాజవరం క్లస్టర్‌లోని బూత్ కన్వీనర్‌లకు జరిగిన ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమంలో మాట్లాడారు. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని బూత్ స్థాయి ప్రజలకు టీడీపీ నాయకులు వివరించాలని కోరారు. టీడీపీ మ్యానిఫెస్టోలో పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేయాలని కోరారు. అదేవిధంగా ఓటరు లిస్టుల వెరిఫికేషన్ చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జిలు ఈర్పిన సత్యనారాయణ, ముళ్ళపూడి పాండురంగ పాల్గొన్నారు.

కొవ్వూరు తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు

చాగల్లు, ఫిబ్రవరి 1: కొవ్వూరులో జరిగిన టీడీపీ ఆత్మీయ సమావేశానికి మండలం నుంచి టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, నాదెళ్ళ శ్రీరామ్‌ల ఆధ్వర్యంలో కేతా సాహెబ్, పార్టీ నాయకులు దొంగ రామకృష్ణ, ఆళ్ల సూర్యప్రకాశరావు, పాశం రామకృష్ణ, ఈడుపుగంటి సుబ్బారావు, ఊబా దుర్గ తదితరులు తరలివెళ్లారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ గెలుపే లక్ష్యంగా అభ్యర్థి ఎంపిక ఉంటుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

కొవ్వూరు టీడీపీలో గ్రూపులు

● జవహర్‌కు టికెట్ ఇవ్వొద్దంటూ ఆత్మీయ సమావేశం

● ద్విసభ్యకమిటీ సభ్యుడు కంఠమణితోపాటు ప్రముఖుల హాజరు



సమావేశానికి హాజరైన టీడీపీ నాయకులు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు టీడీపీలో విభేదాలు మరోసారి బయటపడ్డాయి. మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కెఎస్ జవహర్‌కు కొవ్వూరు టికెట్ ఇవ్వొద్దని ఆయన వ్యతిరేకవర్గం ఆత్మీయ సమావేశం పేరిట గురువారం బల ప్రదర్శనకు దిగారు. కొవ్వూరు లిటరరీ క్లబ్‌లో గురువారం సాయంత్రం నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. గత ఎన్నికల ముందుకూడా ఇదే పరిస్థితి ఏర్పడిన సంగతి తెలిసిందే. 2014 ఎన్నికలలో కెఎస్ జవహర్ ఇక్కడ పోటీచేసి మంత్రి అయ్యారు. కానీ ఆయనతో అక్కడ ఓ బలమైన వర్గంలోని పెద్దలతో విబేధాలు రావడంతో 2019 ఎన్నికలలో ఆయనను ఇక్కడ పోటీ చేయనీయమన్న సంగతి తెలిసిందే. ఇక్కడ ఇంతవరకూ ఎవరినీ ఇన్‌చార్జిగా కూడా నియమించలేదు. ఇద్దరు నాయకులతో ద్విసభ్య కమిటీవేసి, వారితో కార్యక్రమాలు చేస్తున్నారు. ఈద్విసభ్య కమిటీలో ఒకరు జవహర్ వర్గం, మరొకరు వ్యతిరేక వర్గంగా చెబుతుంటారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఈసారి ఇక్కడ నుంచే పోటీచేయాలనే ఆలోచనతో ఆయన ఉన్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా కూడా వ్యహరిస్తున్నారు. ఇటీవల అధిష్టానం కెఎస్ జవహర్‌కు టికెట్ ఇస్తుందనే ప్రచారం బాగా జరుగుతోంది. గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వరరావుకు ఈ టికెట్ ఇస్తారనే మరో ప్రచారం ఉంది. ఇంకా నలుగురైదుగురు టికెట్ ఆశిస్తున్నారు. ఈనేపథ్యంలో కెఎస్ జవహర్ వ్యతిరేక వర్గంగా ఉన్న ఈకింగ్‌మేకర్‌గా ఉన్న అచ్చిబాబు వర్గంగా చెబుతున్న నాయకులు, కార్యకర్తలు ఇక్కడ సమావేశమ య్యారు. ఇక్కడ వర్గాలను జవహర్ ప్రోత్సహిస్తున్నారని, అందువల్ల జవహర్ కు ఎట్టిపరిస్థితులలోనూ సీటు ఇవ్వవద్దని డిమాండ్ చేస్తూ ఓ తీర్మానం కూడా చేశారు. ఇంకెవరిని పోటీ పెట్టినా ఇబ్బందిలేదని కూడా స్పష్టం చేశారు. ఇది టీడీపీలో పెద్ద చర్చకు దారి తీసింది. ఈసమావేశంలో ద్విసభ్యకమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ. మున్సిపల్ మాజీ చైర్మన్ రామ్మోహనరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ హరిబాబు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మద్దిపాటి శివరామకృష్ణ, నాదెళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయాన్ని జవహర్ అధిష్టానం దృష్టికి తీసుకుని వెళుతున్నట్టు సన్నిహితులవద్ద చెప్పినట్టు సమాచారం.

జవహర్ వద్దు.. టీడీపీ ముద్దు

తాళ్లపూడి, ఫిబ్రవరి 1: తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామం నుంచి టీడీపీ యువగళం నాయకులు జవహర్ వద్దు టీడీపీ ముద్దు అనే నినాదంతో రెండు బస్సులలో కొవ్వూరు సభకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా తాళ్ళపూడి బస్టాండ్ వద్ద యువగళం నాయకులు కాకర్ల సత్యేంద్ర మాట్లాడుతూ మాజీ మంత్రి కెఎస్ జవహర్ టీడీపీ నాయకులు మధ్య విభేదాలు సృష్టిస్తూ కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని పార్టీకి నష్టమొచ్చేలా ఆయన చర్యలు ఉన్నాయని 2019కి ముందు నుంచే తాము ఉద్యమం చేస్తున్నామని అందువల్లే ఆయన తిరువూరు వెళ్లారని తిరిగి తూర్పుగోదావరిజిల్లా పార్లమెంటరీ అధ్యక్ష స్థానానికి వచ్చి కొవ్వూరు నియోజకవర్గంలో పార్టీ కోసం పనిచేసే వారిని పక్కనపెట్టి పనిచేయని వారికి పదవులు కట్టబెట్టడం ద్వారా ఆయన విభేదాలు తీసుకు వస్తున్నారని అలాంటి వ్యక్తి కొవ్వూరు నుంచి పోటీ చేసే అవకాశాన్ని కలిపించ వద్దని అధిష్టానాన్ని కోరుతున్నారు.

పలువురు డీఎస్పీల బదిలీలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం నిర్దేశాల ప్రకారం జిల్లాలోని డీఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేసింది. స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ డి.రామవర్మను అనకాపల్లి డీటీసీకి పంపించారు. నాలుగున్నరేళ్ల నుంచీ ఆయన అదే పోస్టులో కొనసాగుతున్నారు. ఆయన స్థానంలో కాకినాడలోని ఏపీఎస్పీ మూడో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ బి.అప్పారావును నియమించారు. సీఐడీ డీఎస్పీ బి.రామకృష్ణను రామచంద్రాపురం ఎస్‌డీపీవోగా, డీఎస్పీ క్రైమ్స్ జీసీ గురునాథ్‌బాబును సత్తెనపల్లి ఎస్‌డీపీవోగా, కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మను నరసారావుపేట ఎస్‌డీపీవోగా, రాజమండ్రి సౌత్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులును నార్త్ జోన్‌కి, డీసీఆర్‌బీ డీఎస్పీ ఎ.శ్రీనివాసరావును సత్యసాయి జిల్లా దిశాకు, చిత్తూరు ఎస్‌డీపీవో కె.శ్రీనివాసమూర్తిని రాజమండ్రి క్రైమ్స్ డీఎస్పీగా, సత్తెనపల్లి ఎస్‌డీపీవో బి.ఆదినారాయణను తూర్పుగోదావరి దిశా డీఎస్పీగా బదిలీ అయ్యారు. రాజమండ్రి రైల్వే పోలీస్ డీఎస్పీ (డీఎస్ఆర్‌పీ) బీవీఎస్ నాగేశ్వరరావు విజయవాడ డీఎస్ఆర్‌పీగా వెళ్లగా ఆయన స్థానంలో డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న ఎల్.మోహన్ రావును నియమించారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో

హుండీలో సొమ్ము చోరీ



సుబ్రహ్మణ్యస్వామి ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న సీఐ జగదీశ్వరరావు

కొవ్వూరు, ఫిబ్రవరి 1 : కొవ్వూరు గోదావరి గట్టుపై సుబ్రహ్మణ్య స్నాన ఘట్టం వద్ద శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో అర్థరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి హుండీలో సొమ్మును దొంగిలించినట్లు కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం ప్రతిరోజు మాదిరిగా గురువారం ఉదయం 6 గంటలకు ఆలయ అర్చకుడు దేవరకొండ సాయిప్రసాద్ ఆలయాన్ని శుభ్రం చేస్తున్నారు. నందీశ్వరుని వద్ద ఉన్న ఆలయ హుండీ కనిపించకపోవడంతో ఆలయమంతా వెతికారు. ఆలయం వెనుకభాగంలో హుండీ తాళాలు బద్దలుకొట్టి, భక్తులు సమర్పించిన సొమ్మును దొంగిలించుకుపోయారు. సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆలయ సీసీ కెమెరా ఫుటేజ్‌లను పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులు ప్రవేశించి, హుండీ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. దీనిపై పట్టణ హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైతు సమస్యలపై అవగాహన అవసరం

● ఉద్యాన కళాశాల డీన్ డాక్టర్ మాధవి

చాగల్లు, ఫిబ్రవరి 1 : విద్యార్థులు రైతు సమస్యలపై అవగాహన పెంచుకోవడం కోసం గ్రామీణ పని అనుభవం కార్యక్రమం దోహదంచేస్తూ ఉద్యాన కళాశాల డీన్ డాక్టర్ మాధవి అన్నారు. నెలటూరు శ్రీసీతారామకళ్యాణ మండపంలో వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వెంకట్రామగూడెం విద్యార్థులు పని అనుభవం ముగింపు కార్యక్రమం జరిగింది. కొవ్వూరు మండలం పశివేదల, చాగల్లు మండలం నెలటూరు, కలవలపల్లి గ్రామాల్లో జరిగిన గ్రామీణ పని అనుభవం ఈకార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు మాట్లాడుతూ కొత్త పద్ధతుల్లో వ్యవసాయం చేసి రైతులకు మేలు కలిగేలా శాస్త్రవేత్తలు, విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఆధునిక సాగు పద్ధతులపై విద్యార్థులకు, రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ యడ్లపల్లి ఉమారజని అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో కొవ్వూరు ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు కే.రవికుమార్, స్నేహలతరాణి, కిషోర్ కుమార్, ఎం.విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.



రైతు సదస్సులో మాట్లాడుతున్న ఉద్యానకళాశాల డీన్ మాధవి

మహిళా సాధికారితకు సీఎం పెద్దపీట

● మంత్రి తానేటి వనిత



డ్వాక్రా నాల్గవ విడత రుణమాఫీ చెక్కును విడుదల చేస్తున్న రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత

దేవరపల్లి, ఫిబ్రవరి 1: మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత అన్నారు. దేవరపల్లి అంబటి సత్యనారాయణరావు జడ్పీ హైస్కూల్‌వద్ద మహిళా అసరా కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా నాల్గవ విడత రుణమాఫీ నమూ నా చెక్కులను గురువారం మంత్రి తానేటి వనిత విడుదల చేశా రు. రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారని, రాష్ట్రంలో ప్రతీ సంక్షేమ పథకాన్ని మహిళ పేరుమీదనే ఇస్తున్నామని అన్నారు. దేవరపల్లి మండలంలో 1663గ్రూపులకు గాను 16630 మంది డ్వాక్రా మహిళలకు 15కోట్ల 33 లక్షలు రుణమాఫీ అంద జేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, వైసీపీ కన్వీనర్ కూచిపూడి సతీష్, గ్రామ సర్పంచ్ కడిమి వీరకుమారి, ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేంద్రబాబు, సొసైటీ అధ్యక్షు డు గడా జగదీష్, కవల శ్రీనివాస్, సర్పంచ్‌లు కుసు లూరి సతీష్, కరుటూరి ఉషారాణి, వైసీపీ నేతలు గడా రాంబాబు, ఆచంట అనసూయ, ఏపీఎం శ్రీనివాస్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గోపాలపురం : విపత్తుల సమయంలో సంక్షేమాన్ని నిరవధికంగా ముందుకు నడిపించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డేనని రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో నాల్గవ విడత వైఎస్సార్ అసరా సంబరాలు కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలో 1267 గ్రూపులకుగాను 12467మంది స్వయం సహాయ మహిళలకు రూ.10కోట్ల 8లక్షల చెక్కు అందజేశారు.

మహిళా సంక్షేమమే టీడీపీ ధ్యేయం

● నగర మహిళ, అంగన్వాడీ కమిటీ ప్రమాణస్వీకారంలో నేతలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 1 : మహిళా సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం తాడితోటలోని రవణం శ్రీరాములు కల్యాణ మండపంలో గురువారం నగర తెలుగు మహిళా కమిటీ, అంగన్వాడీ కమిటీలతో ప్రమాణ స్వీకారం చేయించారు. సమాజంలో మహిళలు శక్తివంతులుగా ఎదగడానికి టీడీపీ అధినేత చంద్రబాబు సంస్కరణలే కారణమన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాస్, బీసీ సీనియర్ నాయకులు రెడ్డి రాజు, ఛాంబర్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, టీడీపీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, నగర అధ్యక్షుడు రెడ్డి మణి, తెలుగుమహిళా పార్లమెంట్ కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి , నగర తెలుగు మహిళా అధ్యక్షురాలు కొసూరి చండీప్రియ , నగర అంగన్వాడీ అధ్యక్షురాలు బోను ఈశ్వరీ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారంలో ఆదిరెడ్డి శ్రీనివాస్



భోజనాలు వడ్డిస్తున్న సచివాలయ కార్యదర్శులు

ఆసరా చెక్కుల పంపిణీ

తాళ్లపూడి, ఫిబ్రవరి 1: తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామంలోని డీవీపీ దానయ్య ఎస్టేట్‌లో గురువారం ఆసరా చెక్కులు పంపిణీ కార్యక్రమం అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. తలారి మాట్లాడుతూ మహిళా సాధికారతే ధ్యేయంగా ప్రతీ సంక్షేమ పథకాన్నీ మహిళల పేరునే అమలు చేస్తున్నామన్నారు. తాళ్ళపూడి మండలానికి 10కోట్ల 87 లక్షల రూపాయలు వైఎస్ఆర్ ఆసరా కింద చెక్కులు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి డ్వాక్రా సంఘ మహిళలను డ్వాక్రా సిబ్బంది బలవంతంగా తీసుకుని వచ్చారని, రాకపోతే తమకు వచ్చే పథకాలు నిలిపివేస్తామని తెలపడంతో వచ్చామని మహిళలు వాపోయారు. భోజనాల కార్యక్రమంలో సప్లైర్స్‌ని పెట్టకుండా సచివాలయ కార్యదర్శులచే భోజనాలు వడ్డించడంతో పలు విమర్శలను ఎదుర్కొంటున్నారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులుపాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్ర్కీన్ 1	గుంటూరుకారం
వై.స్ర్కీన్2	సైంధవ్
దేవిశ్రీ(గాయత్రి)	నా సామి రంగ
అనన్య	గుంటూరు కారం
నిడదవోలు	
వీ మ్యాక్స్	గుంటూరు కారం
రాధాకృష్ణ	హనుమాన్
శ్రీగణపతి	సైంధవ్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్

కొవ్వూరు పురపాలక సంఘం

ఆర్.ఓ.సి.నెం. 16/2024/ఇ1, ది.01.02.2024

బహిరంగ వేలం ప్రకటన

కొవ్వూరు పురపాలక సంఘమునకు చెందిన పాత ఎలక్ట్రికల్ మెటీరియల్స్ మరియు పాత ఫర్నీచర్స్ మొదలగునవి వేలము ద్వారా విక్రయించుటకు గాను తేది.08.02.2024న ఉదయము గం.11.00లకు పురపాలక సంఘ కార్యాలయము నందు శ్రీ కమీషనర్ వారిచే గాని లేక వారి అనుమతి పొందిన అధికారిచే గాని వేలము నిర్వహించబడును. ఆసక్తి గల కొనుగోలుదారులు వేలము పాట నందు పాల్గొనవలసినదిగా తెలియచేయడమైనది. మిగిలిన వివరములు కార్యాలయ పనివేళలలో ఇంజనీరింగ్ సెక్షన్ నందు అడిగి తెలుసుకొనవచ్చును.

కమీషనరు
కొవ్వూరు పురపాలక సంఘము